చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

# సత్యమేవ జయతే





# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**Voice of the leader**

వైసీపీ ప్రభుత్వం 10 రూపాయలు ఇచ్చి 100 రూపాయలు దోచుకుంటుంది. జగన్మోహన్‌రెడ్డి తిన్నది మొత్తం కక్కిస్తాం. రాబోయే రోజుల్లో ఫ్రీడమ్ ఫ్రమ్ కరప్షన్ తీసుకుంటాం. ఒక విజన్ ద్వారా పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయి. దేశంలో ఫ్రీ ఫ్రం కరెప్షన్, ఫ్రీ ఫ్రం క్రైం అనేది సాక్షాత్కారం కావాలి. సంపద కొందరికే పరిమితం అవుతోంది. అందుకే పేదరికం లేని సమాజం కోసం ఒక విజన్ అవసరం. దానికోసమే విజన్ 2047 కు రూపకల్పన చేశాను. -నారా చంద్రబాబునాయుడు

FIRST TELUGU MULTIMEDIA E-PAPER

ఏపీలో అరాచకపాలనపై
డిల్లీలో లోకేష్ నిరశన దీక్ష
4

ఇది ముమ్మాటికీ
కక్ష సాధింపే:
ఎంపీ రామ్మోహన్ నాయుడు
9

తెలుగుదేశం చేపట్టిన
సత్యమేవ జయతే నిరాహార
దీక్షలు విజయవంతం
11

# అవినీతి సొమ్ముపై మాకు ఎప్పుడూ ఆశ లేదు!



**మా కుటుంబం మొత్తాన్ని జైల్లో పెట్టినా కార్యకర్తలే టీడీపీని నడిపిస్తారు: నారా భువనేశ్వరి**

- రాష్ట్రం కోసం నిరంతరం శ్రమించే నేతను జైల్లో పెట్టారు అనేదే బాధ
- ఎన్టీఆర్, చంద్రబాబు సీఎంలుగా చేసినా మా కుటుంబంపై అవినీతి మచ్చ లేదు.. అది నాన్న మాకు నేర్పించిన క్రమశిక్షణ
- చంద్రబాబు అరెస్టుతో చనిపోయిన 105 కుటుంబాలను స్వయంగా కలుస్తా... అండగా ఉంటా
- నిజం గెలవాలి అనేది మన నినాదం... ప్రజల వద్దకు వస్తాను... కలిసి పోరాడుదాం
- నా ఆయుష్షు కూడా పోసుకుని చంద్రబాబు జీవించాలి
- చంద్రబాబు అరెస్ట్ మా కుటుంబాన్ని మనోవేదనకు గురిచేసింది
- నలుగురం నాలుగు దిక్కులుగా అయిపోయాం

2



## దొంగకేసుల నుంచి మమ్మల్ని..
## న్యాయమే కాపాడుతుంది!



- ఏజిల్ వేయడం, గంటకొట్టి నిరసన తెలపడం కూడా నేరమేనా?
- నిరశనదీక్ష ముగింపు సందర్భంగా యువనేత నారా లోకేష్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దొంగ కేసులనుంచి న్యాయం, చట్టాలే తమను కాపాడతాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఢిల్లీలో లోకేష్ చేపట్టిన నిరాహారదీక్షను ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ కుటుంబసభ్యులు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ... మహాత్మాగాంధీ, నెల్సన్ మండేలా నమ్మిన సిద్ధాంతం కోసం జైలుకెళ్లారు, చంద్రబాబు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడం కోసం స్కిల్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు తెచ్చినందుకే దొంగ కేసులు పెట్టి జైలుకు పంపారు. చంద్రబాబునాయుడు ఆంధ్ర నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు తెచ్చి 2.15 లక్షల మందికి శిక్షణ ఇచ్చి, 80వేల మందికి ఉద్యోగాలు కల్పించారు, జవాబుదారీతనంతో పనిచేయాలని,

- మిగతా 3లో..

తప్పు చేశామని నిరూపిస్తే

## నడిరోడ్డుపై ఉరేసుకుంటాం



- సత్యమేవ జయతే దీక్ష విరమణ అనంతరం అచ్చెన్నాయుడి ఉద్ఘాటన
- మంగళగిరి దీక్షలో పాల్గొన్న పలువురు నేతలు
- సంఘీభావం తెలిపిన జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్మిక సంఘాలు
- స్వచ్ఛందంగా దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

6,7

## తప్పుడు కేసులతో..
## జైల్లో తోసేస్తున్నారు!

- రాష్ట్రంలో రాజ్యాంగం, చట్టబద్ధ పాలన మృగ్యం
- పాలకుడు కక్షగడితే.. పోలీసులు చుట్టుముట్టి ఖైదు చేస్తున్నారు

8

తీవ్ర ఉద్రిక్తత, హై డ్రామా మధ్య..

## మాజీమంత్రి బండారు అరెస్ట్

- గోడలు దూకి మరీ ఇంట్లోకి వెళ్లిన పోలీసులు
- బండారు సత్యనారాయణమూర్తికి లోకేష్ ఫోన్

9



నోటీసులు ఇచ్చేందుకు బండారు సత్యనారాయణమూర్తి ఇంటివద్దకు వచ్చిన పోలీసులను అడ్డుకుంటున్న స్థానికులు

చైతన్యరథం

# అవినీతి సొమ్ముపై మాకు ఎప్పుడూ ఆశ లేదు!

## మా కుటుంబం మొత్తాన్ని జైల్లో పెట్టినా కార్యకర్తలే టీడీపీని నడిపిస్తారు: నారా భువనేశ్వరి



- రాష్ట్రం కోసం నిరంతరం శ్రమించే నేతను జైల్లో పెట్టారు అనేదే బాధ
- ఎన్టీఆర్, చంద్రబాబు సీఎంలుగా చేసినా మా కుటుంబంపై అవినీతి మచ్చ లేదు..అది నాన్న మాకు నేర్పించిన క్రమశిక్షణ
- చంద్రబాబు అరెస్టుతో చనిపోయిన 105 కుటుంబాలను స్వయంగా కలుస్తా...అండగా ఉంటా
- నిజం గెలవాలి అనేది మన నినాదం... ప్రజల వద్దకు వస్తాను... కలిసి పోరాడుదాం
- నా ఆయుష్షు కూడా పోసుకుని చంద్రబాబు జీవించాలి
- చంద్రబాబు అరెస్ట్ మా కుటుంబాన్ని మనోవేదనకు గురిచేసింది
- నలుగురం నాలుగు దిక్కులుగా అయిపోయాం



రాజమహేంద్రవరం: సత్యమేవ జయతే పేరుతో తాను చేసిన దీక్ష చంద్రబాబు నాయుడు కోసమో...తన కుటుంబం కోసమో కాదని.... ప్రజల కోసం, అన్యాయాన్ని ప్రశ్నించడం కోసమని నారా భువనేశ్వరి అన్నారు. నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రాజమహేంద్రవరంలో సోమవారం ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు భువనేశ్వరి నిరాహార దీక్ష చేశారు. రాజమహేంద్రవరంలో కోరుకొండ రోడ్డులోని క్వారీ సెంటర్ లో భువనేశ్వరి దీక్షలో కూర్చున్నారు. అంతకు ముందు విద్యానగర్ లోని క్యాంప్ సైట్ నుండి బయలుదేరిన భువనేశ్వరి..కంబాల చెరువులోని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి దీక్షా స్థలికి వెళ్లి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి, తండ్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి దీక్షను ప్రారంభించారు. ఈ దీక్షకు వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి మద్దతు తెలిపారు. యువత, ముస్లిం మహిళలు, గృహిణులు, ఉద్యోగులు దీక్షా వేదిక వద్దకువచ్చి సంఘీభావం తెలిపారు. చంద్రబాబు అరెస్టు అక్రమమని నినదించారు. చంద్రబాబు తోనే మేము అంటూ మద్దతు తెలిపారు. సాయంత్రం భువనేశ్వరికి చిన్నారులు నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. తరలివచ్చిన మహిళలు, ప్రజలనుద్దేశించి భువనేశ్వరి ప్రసంగిస్తూ.. ప్రభుత్వ దృష్టి మొత్తం మా కుటుంబాన్ని జైల్లో పెట్టడంపైనే ఉందన్నారు. అరెస్టుతో కుటుంబంలో ఉన్న నలుగురం..నాలుగుదిక్కులయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబును జైల్లో పెట్టాక బ్రాహ్మణి, తాను రాజమహేంద్రవరంలో ఉన్నామని, లోకేష్ న్యాయం కోసం ఢిల్లీలోనే ఉన్నాడన్నారు. తమ కుటుంబానికి ఈ పరిస్థితి ఎదురవుతుందని ఏనాడూ అనుకోలేదని బాధను వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టుతో రాష్ట్రంలో 105 మంది చనిపోయారని, వారి కుటుంబాలను కలిసి పలకరిస్తానన్నారు. వారి కోసం నిలబడతానని హామీ ఇచ్చారు. నిజం గెలవాలి అనేది మన నినాదం....దీని కోసం నేను కూడా ప్రజల వద్దకు వస్తాను...కలిసి పోరాటం చేద్దాం అని భువనేశ్వరి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నిజం గెలవాలి..ప్రజలు నిలవాలి. మనకు మళ్లీ స్వాతంత్ర్యం రావాల్సి ఉంది. నేను ప్రజలతోనే ఉంటూ ప్రజల కోసమే పోరాడుతా. చంద్రబాబు, కుటుంబం కోసం నేను దీక్ష చేయలేదు. గాంధీ జయంతి రోజున ప్రజల కోసం, అన్యాయాన్ని ఎలుగెత్తి చెప్పడానికి దీక్ష చేశా. మహాత్మాగాంధీ దేశం కోసం బ్రిటీషు వాళ్లతో పోరాడి స్వాతంత్ర్యం తీసుకొచ్చారు. అలాంటి వ్యక్తికే జైలు జీవితం తప్పలేదు.. జైలు నుండి గాంధీ ఎన్నోసార్లు బయటకు వచ్చారు..మళ్లీ జైలుకు వెళ్లారు. నా వెనక మీ అందరు ఇచ్చిన ధైర్యం ఉంది. ఇలా పబ్లిక్ మీటింగుల్లో, రాజకీయ సభల్లో ప్రసంగించడం నాకు అలవాటు లేదు. కుటుంబానికి సమయం కేటాయించాలి అని గతంలో చంద్రబాబు పై ఒత్తిడి తెచ్చేదాన్ని. కానీ ఇప్పుడు చెప్తున్నా నా ఆయుష్షు కూడా పోసుకుని చంద్రబాబు మరిన్ని రోజులు బతకాలి. ప్రజలకు సేవచేయాలి. సత్యమేవ జయతే..అహింసా అనే పదాలు నమ్మి దీక్షలో కూర్చున్నా. ఎన్టీఆర్ టీడీపీని ప్రజల కోసం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ఎంతో నిజాయితీపరులు. ఆ నీడ కిందే మా కుటుంబం ముందకు నడించింది..చంద్రబాబు కూడా అదే స్ఫూర్తితో పార్టీని ముందుకు నడిపారు. ఎన్టీఆర్, చంద్రబాబు సీఎంలుగా చేసినా మా కుటుంబంపై అవినీతి మచ్చ లేదు..అది ఎన్టీఆర్ మాకు నేర్పించిన క్రమశిక్షణ. ఎన్టీఆర్, చంద్రబాబు సీఎంలుగా ఉన్నా ఏనాడూ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయలేదు. అవినీతి చేసినట్లు మా కుటుంబంపై ఒక్క ఆరోపణ కూడా లేదు..మా పని మేము చేసుకుంటూ వెళ్లేవాళ్లం. ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు పార్టీని ముందుకు నడిపిస్తున్నారు. యువతకు ఏ విధంగా మంచి చేద్దామనే చంద్రబాబు నిరంతరం ఆలోచిస్తారు. 25 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించారు. సైబరాబాద్ ను చంద్రబాబు నిర్మించారు. బిల్ గేట్స్, బిల్ క్లింటన్ లాంటి గొప్ప వ్యక్తులు చంద్రబాబు నాయకత్వం పై ఉన్న నమ్మకంతోనే వచ్చి పెట్టుబడులు పెట్టారు. హైదరాబాద్ అభివృద్ధి అయిందంటే దాని వెనక చంద్రబాబు కఠోర శ్రమ ఉంది. రోజుకు 18 గంటలు పని చేసేవారు. రాష్ట్ర విభజన అయ్యి సీఎం అయ్యాక అమరావతి, పోలవరం గురించే నిత్యం ఆలోచించేవారు. అమరావతి సైబరాబాద్ ను మించిపోవాలని కల కనేవారు. రాష్ట్ర విభజనకు మందు 9 ఏళ్లు సీఎంగా చేసినా.. విభజన తర్వాత 5 ఏళ్ల పాటు చంద్రబాబు పడిన కష్టం నేను ఏనాడూ చూడలేదు. విభజనతో రాష్ట్రంలో అప్పులు, రాళ్లు, రప్పలు తప్ప ఏమీ లేవు. ఒక ఇల్లు కట్టాలంటే కనీసం 2 ఏళ్లు పడుతుంది..అలాంటిది ఆదాయం లేని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే 10 ఏళ్లు పడుతుంది. కానీ 5 ఏళ్లలోనే ఎందుకు చేయలేదని హేళన చేశారు. ప్రజలు చేసిన పొరపాటుకు ఉన్నది కూడా పోయింది. మీరంతా మళ్లీ ఆలోచించి ఓటు వేయాలి. మమ్మల్నిందరినీ అరెస్టు చేసినా మా బిడ్డలైన కార్యకర్తలు టీడీపీ జెండాను ఎగరేసి ముందుకు తీసుకెళ్తారు. మేము లోపలున్నా టీడీపీని ముందుకు నడిపిస్తారు. చంద్రబాబుపై నమ్మకం ఉంచిన మీ అందరినీ చూస్తుంటే నాకు చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబును అరెస్టు చేశాక మద్దతుగా ప్రజలు దీక్షలు, ర్యాలీలు చేశారు..దీన్ని నేను మర్చిపోలేను. చంద్రబాబు ఇచ్చిన వెలుగుతోనే చాలా కుటుంబాలు సవ్యంగా నడుస్తున్నాయి. అందుకే అన్ని వర్గాలు ఆయనకు మద్దతుగా నిలిచాయి. రాజకీయాలతో డబ్బులు పొందే ఆలోచన చేయొద్దని చంద్రబాబు ఎప్పుడూ అనేవారు. ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని డబ్బులు సంపాదించాలని కూడా మేము ఏనాడూ అనుకోలేదు. హెరిటేజ్ ద్వారా వ్యాపారం చేసుకుని బతుకుతున్నాం. ప్రజల సొమ్ముపై మాకు ఆశలేదు.

నేడు ఈ మహిళా శక్తిని చూస్తే గర్వంగా ఉంది. మీరు చేసే పోరాటాన్ని చంద్రబాబు నేరుగా చూస్తే ఎంతో సంతోషించేవారు. చంద్రబాబు కోసం మీరు ఇంతలా పోరాడుతున్నారంటే అది ఆయనపై నమ్మకం. మీ బిడ్డల భవిష్యత్తు చూస్తారనే ఆయన కోసం ఇంత మంది మహిళలు రోడ్డెక్కుతున్నారు. చంద్రబాబు ఉంటే భరోసా ఉంటుందని మహిళలు నమ్ముతున్నారు. నిరసన తెలుపుతుంటే మహిళలు అన్న విషయం మర్చిపోయి లాగి పోలీసు వ్యానుల్లో నిర్బంధించి, స్టేషన్ల చుట్టూ తిప్పారు...అయినా చంద్రబాబు కోసం పోరాడారు. చంద్రబాబుకు సంఘీభావం తెలిపి, అండగా నిలుస్తున్నవారందరికీ ధన్యవాదాలు చెప్తున్నా అని భువనేశ్వరి అన్నారు. సత్యమేవ జయతే అని నినాదాలు చేశారు. దీక్షకు జనసేన, సీపీఐ సంఘీభావం తెలిపాయి. ఇరుపార్టీల నేతలు భువనేశ్వరిని కలిసి దీక్షలో పాల్గొన్నారు. బ్రహ్మకుమారీలు సైతం వచ్చి భువనేశ్వరికి తమ మద్దతు తెలిపారు.





## అరచేతిని అడ్డుపెట్టి
# సూర్యుడిని ఆపలేరు

**హైదరాబాద్‌లో ఐటీ రంగం అభివృద్ధి ఘనత చంద్రబాబుదే: మురళీ మోహన్**



హైదరాబాద్: భాగ్యనగరం హైదరాబాద్‌లో ఐటీ రంగాన్ని ప్రవేశపెట్టిన ఘనత టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి దేనని సీనియర్ నటుడు, టీడీపీ మాజీ ఎంపీ మురళీమోహన్ అన్నారు. నేను అమెరికా దాటి ఎక్కడా ఆఫీసు పెట్టలేదు. ఒకవేళ ఇండియాకి వస్తే మొదటిసారి మీ దగ్గరికి వచ్చి ఆఫీసు పెడతా ను. అని ఆనాడు చంద్రబాబుతో మైక్రోసాఫ్ట్ అధినేత బిల్ గేట్స్ అన్నారని గుర్తుచేశారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ రాగానే ఒకరి తర్వాత ఒకరు అందరూ లైన్ కట్టి హైదరాబాద్ వచ్చారని అన్నా రు. బిల్ గేట్స్‌ని హైదరాబాద్ హైటెక్ సిటీ ఓపెనింగ్‌కి చంద్ర బాబు ఆహ్వానించారని గుర్తుచేశారు. 2000 సంవత్సరంలోనే విజన్ 20-20అని ప్రారంభించిన మంచి విజన్ ఉన్న నాయకు డు చంద్రబాబు అని, హైటెక్ సిటీ పెరుగుతుంటే దానికి కావా ల్సిన వసతులన్నీ ముందుగానే ఊహించి దానికి తగ్గట్లుగా ఏర్పా ట్లు చేశారని మురళీ మోహన్ అన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్ట్ తర్వాత ఢిల్లీలో పార్లమెంట్ దగ్గర దీని గురించి చర్చిందా మని మురళీమోహన్ అన్నారు. ఆయన తొందరగా బయటికి రావాలని ఆకాంక్షిస్తున్నట్టు చెప్పారు. రాజ్‌ఘాట్ వెళ్లి అరగంట వేడుకున్నామని, ఇక్కడ ఎన్టీఆర్ ఘాట్‌లో ఇప్పుడు నందమూరి సుహాసిని నిరాహార దీక్ష చేస్తున్నారని అన్నారు. 74 సంవత్సరాల వ్యక్తిని, ఒక మంచి ముఖ్యమంత్రిని అక్రమంగా జైల్లో పెట్టడం అన్యాయమని మురళీమోహన్ వ్యాఖ్యానించారు. ఆయనను వెంటనే విడుదల కావాలన్నారు. రెట్టించిన ఉత్సాహం తో ఆయన ఇంకా ఇంకా మంచి పనులు చేయాలని ఆకాంక్షిం చారు. అరచేయిని అడ్డుపెట్టి సూర్యుని ఆపలేమని, గ్రహణం విడి చిన వెంటనే వచ్చే కాంతి ఎలా ఉంటుందో అందరికీ తెలుసు నని, చంద్రబాబు కూడా గ్రహణం విడిచి అలా బయటికి వచ్చి అద్భుతంగా పనిచేయాలని తాను కోరుకుంటున్నట్టు వెల్ల డించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి నగరం ఇవన్నీ కూడా అద్భుతంగా ఆయన అభివృద్ధి చేస్తారనే విశ్వసిస్తున్నానని చెప్పారు.

## దొంగకేసుల నుంచి మమ్మల్ని..
# న్యాయమే కాపాడుతుంది!

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని చంద్రబాబు చెప్పేవారు. చంద్రబాబు యుద్ధప్రాతిపదికను పనులు చేయడం వల్లే పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చాయి. 45 సంవత్సరా లు అహర్నిశలు పనిచేసి సైబరాబాద్ తోపాటు రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలను అభివృద్ధి చేశారు.

ఏ తప్పూ చేయని చంద్రబాబును స్కిల్ డెవలప్ మెంట్ పేరుతో తప్పుడు కేసుపెట్టి 24రోజులుగా జైలులో పెట్టారు, 45 సంవత్సరాలుగా తెలుగు ప్రజల కోసం, రాష్ట్రం కోసం పని చేసినందుకే చంద్రబాబు నాయుడుపై తప్పుడు కేసులు బనాయించారు. చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గత 24రోజులుగా ప్రజలు శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్నారు, మోతమోగిద్దాం కార్యక్రమంలో పెద్దఎత్తున సామాన్యులు రోడ్డుపైకి వచ్చి నిరసనలు తెలిపారు. నిరసన తెలిపేందుకు విజిల్ వేసి, గంటకొడితే కేసు పెడతారా? అందుకే సీఎం పేరు మార్చాను, పిచ్చి జగన్ అని అంటున్నాను.

పొలిటికల్ యాక్షన్ కమిటీలో అక్టోబర్ 2న నిరాహారదీక్ష చేస్తామని భువనేశ్వరమ్మ చెప్పారు, అమెకు సంఘీభావంగా మేము కూడా దీక్ష చేపట్టాం, దీక్షలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు. ఈ ప్రభుత్వం వద్ద ఆధారాలు ఉంటే జడ్జి ముందు పెట్టాలి, ఆధారాలు లేని స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబును జైలుకు పంపడమేగాక మరో 3 కేసులు రెడీ చేశారు, మంత్రులు రోజుకోసారి నన్ను, భువనేశ్వరమ్మను, బ్రాహ్మణిని జైలుకు పంపుతామని అంటున్నారు. ఇది ముమ్మాటికీ కక్షసాధింపే. అయినా మేము తగ్గేదేలేదు, పోరాటం కొనసాగిస్తాం. మాపై పెట్టిన తప్పుడు కేసులను ఆధారాలతో సహా అన్నీ ప్రజల ముందు ఉంచుతాం. రేపు సుప్రీం కోర్టులో క్వాష్ పిటిషన్ విచారణకు వస్తుంది, కోర్టు నిర్ణయాన్ని బట్టి మా భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని యువనేత లోకేష్ పేర్కొన్నారు.

# పీకే సర్వేలో కూడా వైసీపీ ఓడిపోతుందని తేలింది

## అందుకే కుట్రలతో చంద్రబాబును జైలుకు పంపారన్న టీడీ జనార్ధన్



హైదరాబాద్(ఎన్టీఆర్ భవన్): వైసీపీ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్(పీకే) సర్వేలో కూడా జగన్ ప్రభుత్వం ఓడిపోతుందని తేలిందని తెలుగు దేశంపార్టీ సీనియర్ నేత టీడీ జనార్ధన్ వ్యాఖ్యా నించారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కునిరసనగా ఎన్టీఆర్ భవన్‌లో సోమ వారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జనార్దన్ మీడియాతో మాట్లాడుతూ అవినీతి పరులు అధికారంలోకి వస్తే నిజాయతీ పరులు జైలుకు వెళ్తారనేది ఆంధ్రదేశంలో నడుస్తోంది. సీ ఓటర్ సర్వేలో 15పార్లమెంట్ స్థానాలు తెలుగు దేశానికి వస్తాయని తేలింది. పీకే సర్వేలోకూడా వైసీపీ ఓడిపోతుందని తేలింది. దీంతో ఏపీ ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డికి నిద్రపట్టక పోవడంతో చంద్రబాబును జైలుకు పంపాలని కుట్రలు పన్నారన్నారు. ప్రభుత్వం వచ్చిన ఇన్ని రోజులకు కేసు గుర్తుకు వచ్చింది. ఆధారాలు ఏవని అడిగితే ఆధారాల కోసమే టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేశామని చెప్పడం దుర్మార్గం. ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ సంవత్సరాలు సీఎంగా ఉన్న వ్యక్తి చంద్రబాబు.

ఎన్టీఆర్ నిప్పులాంటి మనిషి.. ఆస్తులను త్యజించి రాజకీయాల్లోకి వచ్చారు. చంద్రబాబుపై రాజశేఖరరెడ్డి కూడా కేసులు వేశారు. ఒక్క కేసును కూడా న్యాయస్థానాలల్లో నిరూపించలేక పోయారు. టీడీపీ నేతలు చంద్రబాబు విడుదల కావాలని ప్రార్థనలు చేస్తున్నారు. అందులో భాగంగా నేడు సత్యాగ్రహ దీక్ష చేపట్టాం. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేపట్టాలి. సోషల్ మీడియా ప్రచారం ద్వారా ఉద్యమానికి ప్రజలను సమాయత్తం చేయాలని పేర్కొన్నారు.



## చంద్రబాబుకు న్యాయం జరుగుతుంది:
### నందమూరి వసుంధర

హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపించారని నందమూరి బాలకృష్ణ సతీమణి వసుం ధర అన్నారు. తెదేపా అధినేత చంద్రబాబు అక్రమఅరెస్ట్‌కు నిరస నగా సత్యమేవ జయతే పేరిట హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్‌భవ న్‌లో జరిగిన నిరాహార దీక్షలో ఎన్టీఆర్ కుటుంబసభ్యులు పాల్గొన్నా రు. ఈసందర్భంగా వసుంధర మాట్లాడుతూ చంద్రబాబుకు న్యా యం జరుగుతుందన్న నమ్మకం తమకు ఉందన్నారు. న్యాయం జరగటం ఆలస్యంకావచ్చేమో కానీ జరగకుండా పోదని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ దీక్షలో ఎన్టీఆర్ కుమార్తె గారపాటి లోకేశ్వరి, గారపాటి శ్రీనివాస్,చలసాని చాముండేశ్వరి,చంద్రబాబు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు సతీమణి ఇందిర, సినీనటుడు తారకరత్న సతీమణి అలేఖ్యరెడ్డి, నందమూరి జయశ్రీ, సుధ, శిల్ప, దీక్షిత, రాహుల్, తారకరత్న కుమార్తె నిష్క తదితరులు పాల్గొన్నారు. తెలం గాణ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తోపాటు ఇతర ముఖ్యనేతలు, కార్యకర్తలు దీక్షకు కూర్చొన్నారు.

## విజిల్స్ వేసినందుకు
# 60 మందిపై కేసా?

**సైకో పాలనలో ప్రజాస్వామ్యానికి పాతరేశారని లోకేష్ మండిపాటు**

అమరావతి: టీడీపీ అధినేత చంద్ర బాబు అరెస్ట్‌కు నిరసనగా విజిల్స్ వేసి సౌండ్ చేశారంటూ గుంటూరు లో 60మందిపై పోలీసులు కేసు నమోదు చేయ టంపై ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిల్ వేస్తే 60 మందిపై కేసా? పోలీస్ స్టేషన్ కు పిలిచి విచారిస్తారా? వీళ్ళ తీరు చూస్తుంటే టీవీలో చంద్రబాబు అరెస్ట్ వార్తలు చూశారని, పసుపు రంగు దుస్తులు కట్టుకున్నారని, సైకిల్ బ్రాండ్ అగర్ బత్తీలు వాడారని కూడా కేసు పెట్టేలా ఉన్నారు. ఒక పని చేయండి రాజద్రోహం కేసు పెట్టి... ఉరిశిక్ష వేసేయండి. జగన్‌కి పిచ్చి పీక్స్‌లో ఉన్నట్లు ఉంది. కేసులు పెట్టాలని ఆదేశాలు ఇచ్చినోడికి సరే...అమలు చేసినోడి బుర్రా బుద్ధీ ఏమయ్యింది. సైకో జగన్ ఫ్యాక్షన్ పాలనలో ప్రజాస్వామ్యానికి పాతరేశారు. రాజ్యాంగాన్ని కాలరాశారు. సత్యాన్ని వధించారు. తప్పుడు కేసులు పెట్టి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారు. జగన్ ప్రభుత్వ అరాచకా లను నిరసిస్తూ దీక్ష చేసి చంద్రబాబుకు సంఘీభావం తెలుపుతున్నానంటూ లోకేష్ తెలిపారు.












# ఏపీలో అరాచకపాలనపై

# ఢిల్లీలో లోకేష్ నిరశన దీక్ష

## సత్యమేవ జయతే దీక్షకు ప్రముఖుల సంఘీభావం

### దీక్షలో పాల్గొన్న ముఖ్యనేతలు, కార్యకర్తలు, ప్రజలు ◆ సర్వమత ప్రార్థనలు నిర్వహించిన మతపెద్దలు

న్యూఢిల్లీ: తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడుపై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి, అక్రమంగా అరెస్టు చేసినందుకు నిరసనగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ దేశ రాజధాని ఢిల్లీలో నిరాహారదీక్ష చేపట్టారు. న్యూఢిల్లీలోని లోధి రోడ్డులో ఏర్పాటుచేసిన శిబిరం వద్ద సోమవారం ఉదయం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసిన లోకేష్ సత్యమేవ జయతే పేరుతో దీక్ష ప్రారంభించారు. ఏపీ నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు సేవ్ డెమోక్రసీ, సేవ్ అంధ్రప్రదేశ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఏపీలో సైకోజగన్ ఫ్యాక్షన్ పాలన సాగిస్తూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని లోకేష్ ఆగ్రహం వ్యక్తంచేశారు. 45ఏళ్ల సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఏ తప్పూ చేయని చంద్రబాబును అక్రమ కేసుల్లో ఇరికించి 23 రోజులుగా జైలులో నిర్బంధించారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని, జగన్ ప్రభుత్వ అరాచకపాలనకు నిరసనగా దీక్ష చేపట్టినట్లు చెప్పారు. లోకేష్ చేపట్టిన దీక్షకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, ఆంధ్రప్రదేశ్ మేధావుల సంఘం నాయకుడు చలసాని శ్రీనివాస్, పామర్రు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకుడు డివై దాస్, వివిధ రంగాల ప్రముఖులు సంఘీభావం తెలిపారు. ఢిల్లీ లో నివసిస్తున్న తెలుగు ప్రజలు, మహిళలు, యువత పెద్దఎత్తున నిరశన దీక్షలో పాల్గొన్నారు. హిందూ, ముస్లిం సంఘాల పెద్దలు, ఢిల్లీ తెలుగు పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు దీక్షాశిబిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సంఘీభావం తెలిపారు. యువనేతకు మద్దతుగా దీక్షలో ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని, రామ్మోహన్ నాయుడు, వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు, మాజీ ఎంపీ కంభంపాటి రామ్మోహన్ రావు, మాజీ మంత్రి కొండ్రు మురళి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పార్టీ ముఖ్యనేతలు దామచర్ల సత్య, ముళ్లపూడి బాపిరాజు, దూండీ రాకేష్, భూమా జగత్ విఖ్యాత రెడ్డి, కురుబ సవిత, బ్రహ్మం చౌదరి, మన్నె శివనాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.








చైతన్యరథం













# భారీగా తరలివచ్చిన మహిళలు

నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ సత్యమేవ జయతే పేరుతో రాజమహేంద్రవరంలో నారా భువనేశ్వరి చేపట్టిన నిరాహార దీక్షకు విశేష స్పందన లభించింది. సత్యమేవ జయతే దీక్షకు ముందు రాజమహేంద్రవరంలో గాంధీ విగ్రహానికి భువనేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు భువనేశ్వరి, పలువురు మహిళా నేతలు దీక్ష లో కూర్చున్నారు. ఈ దీక్షకు వివిధ ప్రాంతాల నుంచి మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలిపారు. ఉదయం నుంచే దీక్షా శిబిరానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. దీక్షకు మద్దతు తెలిపి బాబు తో నేను అంటూ నినాదాలు చేశారు. వృద్ధులు, యువత, వివిధ వర్గాల మహిళలు, ముస్లిం మహిళలు దీక్షలో పాల్గొన్నారు. భువనేశ్వరిని కలిసిన జనసేన మహిళలు తమ మద్దతు తెలిపారు. తరలివచ్చి సంఘీభావం తెలిపిన వారికి భువనేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. పిల్లల చేతుల మీదుగా నిమ్మరసం తీసుకుని 5.10 గంటలకు భువనేశ్వరి దీక్ష విరమించారు.























## తప్పు చేశామని నిరూపిస్తే

# నడిరోడ్డుపై ఉరేసుకుంటాం

- సత్యమేవ జయతే దీక్ష విరమణ అనంతరం అచ్చెన్నాయుడి ఉద్ఘాటన
- మంగళగిరి దీక్షలో పాల్గొన్న పలువురు నేతలు
- సంఘీభావం తెలిపిన జనసేన, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్మిక సంఘాలు
- స్వచ్ఛందంగా దీక్షలో కూర్చున్న న్యాయవాదులు



మంగళగిరి: మేము తప్పు చేయము.. చేశామని నిరూపిస్తే నడిరోడ్డుపై ఉరివేసుకుంటామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఎటువంటి ఆధారం లేని స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేశారని మండిపడ్డారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమఅరెస్ట్‌కు నిరసగాగాంధీ జయంతి సందర్భంగా మంగళగిరిపట్టణంలోని వైష్ణవి కళ్యాణ మండపం పక్కన సత్యమేవ జయతే పేరుతో నియోజక వర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రాఘు రామరాజు దీక్షలో కూర్చున్నారు. ముందుగా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మహాత్మా గాంధీ, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళులర్పించి దీక్షలో పాల్గొన్నారు. పలువురు న్యాయవాదులు స్వచ్ఛందంగా దీక్షలో కూర్చున్నారు. సైకో పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం దుస్థితిని వివరిస్తూ ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, మునగపాటి మారుతీరావు, హుస్సేన్‌రావు, సీపీఎం నాయకులు ముసలి పకీరాయ్య, సీపీఐ నాయకులు ముప్పాల నాగేశ్వరరావు, చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వర రావు, జిల్లా నాయి బ్రహ్మణ సేవా సంఘం సాధికార కమిటీ సభ్యులు, స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొంది ఉద్యోగాలు పొందిన వారు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలియజేశారు. సాయంత్రం కార్మికుల సంఘాల నాయకులు దీక్షలో కూర్చున్న వారికి నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు.

అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఇచ్చిన చంద్రబాబును ఎటువంటి అధారంలేని కేసులో అరెస్టు చేశారని మండిపడ్డారు. 45సంవత్సరాల రాజకీయ జీవితంలో చంద్రబాబు తప్పు చేయలేదు. ఎవరినీ చేయనివ్వలేదని పేర్కొన్నారు. 74సంవత్సరాల వ్యక్తిని అక్రమంగా. జైల్లో పెట్టడం అన్యాయమని వ్యాఖ్యానించారు. మహాత్మాగాంధీ జన్మదినం సందర్భంగా చంద్రబాబు నాయుడు చేస్తున్న దీక్షకు మద్దతుగా 175 నియోజక వర్గాలలో సత్యమేవ జయతే దీక్షలు చేపట్టామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలకు, కులాలకు అతీతంగా అందరూ గాంధేయ మార్గంలో నిరసన దీక్ష చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలన్నింటినీ ప్రజలు దగ్గరగా చూస్తున్నారన్నారు. జగన్‌ను 5కోట్ల మంది ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబును జైలులో చూసి చాలా బాధ కలుగుతోందన్నారు. స్కిల్ కేసు ఎప్పుడు పెట్టారు. ఎప్పుడు అరెస్టులు చేస్తున్నారని ప్రశ్నించారు. జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తే 160సీట్లుకు పైగా గెలుస్తాయని సర్వేలు చెబుతున్నాయన్నారు. మేము తప్పు చేయము. ఒకవేళ చేశామని నిరూపిస్తే నడిరోడ్డుపై ఉరి వేసుకుంటామన్నారు. ఎన్నో పేద కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకువచ్చిన ఘనత టీడీపీదే అన్నారు. చంద్రబాబు బయటఉంటే తమకు భవిష్యత్తు లేదనే భయంతో ముఖ్యమంత్రి జగన్ కుట్ర పన్ని అక్రమకేసుల్లో జైలుకు పంపారన్నారు. చంద్రబాబును అరెస్టుచేసి జగన్ తన పీకను తానే కోసుకున్నారని వ్యాఖ్యనించారు. అసలు రింగ్‌రోడ్డే లేదు, అవినీతి దారుణాలను ఎప్పుడూచూడలేదని విమర్శించారు. మోత మోగిద్దాం కార్యక్రమంలో సౌండ్ చేశారని పోలీసులు కొందరిపై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. 11 కేసుల్లో ముద్దాయిగా ఉన్న జగన్ యథేచ్ఛగా బయట తిరుగుతున్నాడని విమర్శించారు. తండ్రి అధికారాన్ని అడ్డంపెట్టుకొని లక్ష కోట్లు అవినీతి చేసి పదేళ్లుగా బెయిల్‌పై తిరుగుతున్న వ్యక్తి జగన్ అని అన్నారు. ఏ తప్పు చేయకున్నా జైలులో చంద్రబాబును హింసిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అక్రమ కేసులో భాగస్వాములైన వారు ఎక్కడికి పారిపోయినా తీసుకువచ్చి శిక్షిస్తామన్నారు. ప్రజాస్వామ్యానికి ఇబ్బంది కలగకుండా చూడాలని మా నాయకుడు జైలు వెళ్ళేటప్పుడు మాకు చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ 70 దేశాలలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. సత్యమేవ జయతే తమ నినాదమన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌ను బంగాళఖాతంలో కలిపేయడం ఖాయమన్నారు. చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అంతవరకు తాము విశ్రమించమని, పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. రేపు సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందన్నారు. దీక్షలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

### నేరగాళ్లు బయట.. తప్పు చేయని చంద్రబాబు జైల్లో: వర్ల

పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ భారతదేశంలో అత్యంత సీనియర్ నాయకుడు, ఎటువంటి అవినీతి మచ్చలేనటువంటి చంద్రబాబు నాయుడుపై రాజకీయ దురుద్దేశ్యంతో అక్రమ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారని ఆరోపించారు. 43 వేల కోట్ల రూపాయల స్కాంలో ఆర్థిక నేరగాడిగా సీబీఐ 11 ఛార్జ్ షీట్లు నమోదు చేసి 16 నెలలు జైలుశిక్ష అనుభవించి ఏ 1గా ఉన్న నిందితుడు చట్టాన్ని ధిక్కరించి బయట తిరుగుతున్నాడన్నారు. కానీ అహర్నిశలు, రాష్ట్రం కోసం, ప్రజల అభ్యున్నతి కోసం పనిచేసిన చంద్రబాబును జైలులో పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా చంద్రబాబు అరెస్టును అందరూ ఖండిస్తున్నారన్నారు. సూర్యుడి మీద ఉమ్మి వేయాలనుకుంటే అది తిరిగి మన మీదే పడుతుందన్న విషయాన్ని జగన్ గ్రహించాలన్నారు. పోలీసులు వైసీపీ నాయకులను సంతృప్తి పరచడానికి ఆదుపు తప్పుతున్నారన్నారు. వైసీపీ రాష్ట్రాన్ని ఫ్యాక్షన్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చేసిందన్నారు. త్వరలో చట్టం గెలవబోతుందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వానికి బుద్ది చెప్పేలా 2024 ఎన్నికల్లో నారా లోకేష్ ను మంగళగిరి నుంచి భారీ మేజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి అవినితిపై ఘటుగా విమర్శలు చేశారు. ఉండవల్లి కొండను అక్రమంగా తవ్వి కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. గిరి ప్రదక్షిణ పేరుతో మంగళగిరి కొండ గ్రావెల్ దోపిడీ, కాజా, ఇప్పటంలో మట్టి దోపిడీ, నీరుకొండ, ఎయిమ్స్ కొండలను అక్రమంగా దోచేశారన్నారు. కొన్ని రోజుల క్రితం నవులూరు చెరువును 40 అడుగుల లోతున అక్రమంగా తవ్వేస్తే ఆ చెరువులో పడి చిన్న పిల్లవాడు చనిపోతే ఇప్పటి వరకు అధికారులు, ఎమ్మెల్యే పరామర్శించలేదన్నారు. గౌతమ్ బుద్ధ రోడ్డు వెడల్పు పేరుతో దోపిడీ చేశారన్నారు. నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఇసుక ర్వారీలు ఏర్పాటు చేసుకోని పెద్ద పెద్ద మిషన్లు, జేసీబీలతో నిత్యం వందలాది లారీలతో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి వందలాది కోట్లు కూడగట్టుకున్నారని ఆరోపించారు. ప్రజా వేదిక కూల్చివేత నుండి తెలుగునాడు చేనేత కార్మిక భవనం,పేదలకు అన్నం పెట్టే మంగళగిరి అన్న కాంటీన్ లను జేసీబీలతో కూల్చివేశారన్నారు. చరిత్రలో మొదటిసారి కృష్ణాయపాలెంలో ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసిన ఘనత కరకట్ట కమల్ హాసన్‌కు దక్కుతుందని విమర్శించారు. నియోజక వర్గంలో వేలాది పేదల ఇళ్లను తొలగించారన్నారు. తాడేపల్లిని గంజాయి అడ్డాగా మార్చివేశారు. సీఎం ఇంటికి కూతవేటు దూరంలో మహిళపై అత్యాచారం జరిగితే ఇంతవరకు నిందితులను పట్టుకోలేదన్నారు. బీసీ ముస్లీం మహిళ ఎంపీపీ కాకుండా బీసీ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకున్నారన్నారు. బీసీ మహిళపై అత్యాచారం, హత్య జరిగితే నిందితులకు అండగా నిలిచి, పరామర్శకు వెళ్లిన లోకేష్ పై రాళ్ల దాడి, ఎస్సీ ఎస్టీ అక్రమ కేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### చంద్రబాబు అక్రమ అరెస్ట్ బాధాకరం: పట్టాభి

జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ జగన్ రెడ్డి తన ఫ్యాక్షన్ రాజకీయంతో గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలో నెట్టేశారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాలున్నర ఏళ్లలో టీడీపీ అధినేత చంద్రబాబుపై ముఖ్యమంత్రి జగన్ అనేక అరోపణలు గుప్పించారని, వాటిలో ఒక్కటి కూడా రుజువు చేయలేకపోయారని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి కక్షపూరితంగా కుట్ర పన్నారన్నారు. చేయని తప్పునకు కేసు మోపి చంద్రబాబును అరెస్టు చేయడం దురదృష్టకరమని, అత్యంత బాధాకరమని అన్నారు. 42 స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు కళ్ళముందే కన్పిస్తున్నాయన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా కొన్ని లక్షల మందికి శిక్షణ ఇవ్వడంతో వారు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి రకరకాల విన్యాసాలు చేస్తారని విమర్శించారు. ఆర్కేకు ఫిర్యాదులు చేయడం తప్ప అభివృద్ధి చేయడం తెలియదన్నారు. 2018 జూలైలో ఇన్నర్ రింగ్ రోడ్డు విషయంలో అభ్యంతరాలు ఉంటే తెలియజేశాలని బహిరంగ ప్రకటన ఇస్తే 1000 మంది సీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి తమ అనుమానాలను నివృత్తి చేసుకుంటే అప్పుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డి ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల కిలోమీటర్లు ఫైబర్ నెట్ కేబుల్స్ వేస్తే 2019లో ఆ కేబుల్స్‌ను కత్తిరించి వాళ్ళే ఎదురు టీడీపీ నాయకులపై

- (మిగతా వివరాలు 7లో)

## చంద్రబాబు వైపే న్యాయం: ఎంఏ షరీఫ్

శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ బాధాతప్త హృదయాలతో నిరసనలుచేస్తున్నట్లు పేర్కొన్నారు. జగన్ లాంటి వ్యక్తిని సీఎంగా ఎన్నుకోవడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టం అన్నారు. పదవి కోసం తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాలు చేయించుకున్న జగన్‌కు మానవతా విలువలు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. దుగ్గిరాలలో బీసీ ముస్లీం మహిళ ఎంపీపీ కాకుండా బీసీ సర్టిఫికెట్ ఇవ్వకుండా ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి అడ్డుకున్నారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోవడానికి ప్రధాన సూత్రదారులు జగన్, కేసీఆర్ లే అన్నారు. రాజధాని లేని అమరావతిని అభివృద్ధి చేయడానికి చంద్రబాబు అహర్నిశలు కష్టపడ్డారన్నారు. జగన్ తన సొంత సామాజిక వర్గానికే అన్నీ కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఒక్క అవకాశం అంటూ ప్రజలను వేడుకుని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి.. నాలుగేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. కూల్చివేతలు, ప్రతిపక్షాలపై వేధింపులు, కక్ష సాధింపులు, అక్రమకేసులు తప్ప వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమీలేదని విమర్శించారు. పోలీస్ వ్యవస్థను తన అధీనంలో పెట్టుకొని జగన్ రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలపై అక్రమకేసులు పెట్టి భయపెట్టడం వంటి కార్యక్రమాలకే నాలుగున్నరేళ్ల సమయం సరిపోయిందన్నారు. జగన్ రూ.43వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని స్వయంగా సీబీఐ నిర్ధారించిందన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరు భావిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికలలో జగన్ కు ప్రతిపక్షం హెూదా కూడా రాకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. న్యాయం చంద్రబాబువైపే ఉందని, ఆయన కడిగిన ముత్యంలా బయటపడతారని ధీమా వ్యక్తం చేశారు.

## వివేకా హత్య కేసులో భారతి కూడా జైలుకు వెళ్తారు

**టీడీపీ, జనసేన కూటమికి 160 సీట్లు వస్తాయి: డీఎల్ రవీంద్రారెడ్డి**



కడప: వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి భారతి కూడా జైలుకు వెళ్తారని మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నాడు ఆయననివాసంలో మీడియాతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన కూటమి 160 సీట్లు సాధిస్తుంది. స్కిల్ డెవలప్మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు. చంద్రబాబును అరెస్టుచేసి సీఎం జగన్‌రెడ్డి తనగోతిని తానే తవ్వుకున్నాడు. జగన్మోహన్‌రెడ్డిని త్వరలో ఏపీ నుంచి తరిమేసే రోజులు వస్తాయి. జగన్‌రెడ్డి పరిపాలన అంతా అవినీతి మయం. జగన్‌రెడ్డితో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు కూడా అవినీతిలో కూరుకుపోయారు. వివేకానందరెడ్డి హత్యకేసులో సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ అజయ్ కల్లంరెడ్డి యూటర్న్ తీసుకోవడం చాలాబాధ కలిగించిందని డీఎల్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు.

## మాజీ మంత్రి నారాయణకు సీఐడీ నోటీసులు

**ఈ నెల 4న లోకేశ్‌తో పాటు ఐఆర్ఆర్ కేసులో విచారణకు రావాలన్న సీఐడీ**

అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్) కేసులో టీడీపీ నేత, మాజీ మంత్రి పీ.నారాయణకు సీఐడీ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చారు. ఈనెల 4వ తేదీన టీడీపీ యువనేత నారా లోకేశ్‌తో పాటు తమ ముందు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు ఢిల్లీలో ఉన్న నారా లోకేశ్ కు సీఐడీ అధికారులు 41ఏ కింద నోటీసులు అందజేసిన సంగతి తెలిసిందే. 4వ తేదీ ఉదయం 10గంటలకు సీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో లోకేశ్‌ను ఏ14గా సీఐడీ అధికారులు పేర్కొన్నారు.

## చంద్రబాబుపై అవినీతి మరక వేసి పైశాచికానందం

**సీఎం జగన్‌పై మండిపడ్డ వంగలపూడి అనిత**



రాజమండ్రి: టీడీపీ అధినేత చంద్రబాబుపై అవినీతి మరక వేసి సీఎం జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని మాజీ మంత్రి, తెలుగుమహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. రాజమహేంద్రవరంలో భువనేశ్వరి చేపట్టిన సత్యమేవ జయతే దీక్షా శిబిరంలో అనిత మాట్లాడుతూ.. చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. అవినీతి మరక వేసి జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఎన్టీఆర్ కుమార్తె భువనేశ్వరి న్యాయం కోసం దీక్ష చేస్తున్నారు. ఆంధ్రుల ఆత్మాభిమానాన్ని జైలులో పెట్టారు. జగన్ 16 నెలలు జైలులో ఉన్నారు. రెండు లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన జగన్ సీఎం కుర్చీలో కూర్చున్నారు. చంద్రబాబు కుటుంబానికి అండగా ఉంటాం అని పేర్కొన్నారు.

# వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**అహింసా మార్గంలో వెళ్లడం ఇప్పుడు సాధ్యం కాదన్న పవన్**



మచిలీపట్నం: ప్రజల కష్టాన్ని శ్రమను అవినీతి, దౌర్జన్యంతో వైసీపీ నేతలు దోచుకుంటున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విమర్శించారు. గాంధీజీ అహింసా, త్యాగాల వల్లే మనకు స్వాతంత్ర్యం వచ్చిందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. మహాత్ముడు చూపించిన అహింసా మార్గంలో వెళ్లడం ఇప్పుడు సాధ్యం కాదు. గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో సోమవారం ఆయన మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ బందర్ జాతీయ ఉద్యమంలో పునీతమైన నేల. ఇక్కడి ఆంధ్రా నేషనల్ కాలేజ్ ప్రత్యేకమైన పరిస్థితిలో పెట్టారు. మనది అని చెప్పేందుకు పెట్టిన కాలేజీ ఇది. దివిసీమ, బందరు ప్రాంతాల్లో గాంధీజీ పర్యటించారు. నేషనల్ కాలేజ్‌ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలోనే మువ్వెన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య జన్మించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, నోరి దత్తాత్రేయ వంటి ఎందరో ఈ ఆంధ్రా కళాశాలలో చదివారు. నేడు ఈ కళాశాలలో సరైన వసతులు లేవని చెబుతున్నారు. గాంధీ వెళ్లిన ఆ కళాశాలను త్వరలో సందర్శిస్తా. మన దేశ ఔన్నత్యాన్ని పెంచిన గాంధీకి రుణపడి ఉండాలని కోరారు.

అవినీతి, దౌర్జన్యంతో నేడు రాష్ట్రంలో ప్రజల కష్టాన్ని, శ్రమను దోచుకుంటున్నారు.

ఈ రాష్ట్ర సీఎం లక్షల కోట్లు దోచుకుని విదేశాలకు తరలించారు. ఈ దోపిడీకి, అవినీతికి అడ్డుకట్ట వేయాలి. 2024 ఎన్నికల తర్వాత మన ప్రభుత్వం వచ్చాక గాంధీ జయంతిని బందరులో చేసుకుందాం. రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు ఉండటం సహజం. అంతమాత్రాన కక్షగట్టి జైళ్లకు పంపించటం తగదన్నారు. దేశ అవసరాల కోసం ఎవరితో అయినా కలిసే స్వేచ్ఛ నాకు ఉంది. జగన్‌పై నాకు వ్యక్తిగత ద్వేషం లేదు. ఆయన ఆలోచన, పాలన నిర్ణయాలను వ్యతిరేకించా. గ్రామ స్వరాజ్యాన్ని ఈ ప్రభు త్వం చంపేసింది. గాంధీ అహింసా మార్గంలో వెళదామన్నా ఇప్పుడు నాయకులతో సాధ్యం కాదు. ప్రజల కోసం, రాష్ట్ర హితం కోసం కలిసి పోరాడాలి. వచ్చే ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి. బురదలో నుంచి కమలం వచ్చిన ట్లు... కలుషితమైన రాజకీయాల్లో నుంచి జనసేన కమలం వికసిస్తుంది. రాజకీయాల్లో బురద పడు తుందని తెలుసు.. అయినా ముందుకే సాగుతాం అని పవన్ స్పష్టం చేశారు.

# సైకో పాలన నుంచి త్వరలోనే విముక్తి: నారాయణ



నెల్లూరు: రాష్ట్రానికి సైకో పాలన నుంచి త్వరలోనే విముక్తి లభిస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి పీ.నారాయణ అన్నారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయం వద్ద సత్యమేవ జయతే దీక్ష కార్యక్రమంలో మాజీ మంత్రి నారాయణ, టీడీపీ సీనియర్ నాయకుడు బీద రవిచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ గాంధీ జయంతిని అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రపంచమంతా జరుపుకుంటున్నారన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసుని నిరసిస్తూ శాంతియుతంగా దీక్ష చేపట్టామన్నారు. ఏపీలో అరాచకపాలన సాగిస్తున్న సైకో నుంచి త్వరలోనే విముక్తి లభిస్తుందని నారాయణ చెప్పుకొచ్చారు.

బీద రవిచంద్ర మాట్లాడుతూ... నారా భువనేశ్వరి తన తండ్రి, భర్త సీఎంలుగా పని చేసినా ఏ రోజూ రాజకీయాలు, పాలన గురించి పట్టించుకోలేదన్నారు. నిండు సభలో భువనేశ్వరిని దుర్మార్గంగా, నీచంగా అవమానించారన్నారు. ఇవాళ ప్రజల కోసం ఓ తల్లిలా, అక్కలా, చెల్లెలిలా పోరాడుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌ను ఎందుకు ఓడించాలి? చంద్రబాబుని ఎందుకు గెలిపించాలి? అని ప్రజలు ఆలోచిస్తున్నారని అన్నారు.



# ప్రపంచ సైకోల సంఘానికి జగన్ శాశ్వత అధ్యక్షుడు

**- టీటీడీపీ సీనియర్ నేత నన్నూరి నర్సిరెడ్డి విసుర్లు**

హైదరాబాద్,(ఎన్టీఆర్ భవన్): ప్రపంచ సైకోల సంఘానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శాశ్వత అధ్యక్షుడని టీటీడీపీ సీనియర్ నేత నన్నూరి నర్సిరెడ్డి సెటైర్లు వేశారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎన్టీఆర్‌భవన్‌లో సోమవారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్.. అంతర్జాతీయ అవినీతి సంఘానికి అధ్యక్షుడు. ఏపీలో డేటా చోరీ జరిగితే.. హైదరాబాద్‌లో కేసు ఎందుకు పెట్టారో మంత్రి కేటీఆర్ చెప్పాలి? జీవనోపాధి కోసం హెరిటేజ్ పాలు చంద్రబాబు అమ్ముకుంటున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్ ప్రభావం ఏపీ అభివృద్ధి, యువత భవిష్యత్తు మీద పడుతోంది. చంద్రబాబు బయటకు వచ్చేవరకు అలుపెరగని పోరాటం కొనసాగిస్తాం. ఏపీలో ధర్మానికి, అధర్మానికి మధ్య యుద్ధం జరుగుతోంది. 38 కేసుల్లో దోషిగా ఉన్న జగన్.. తన అవినీతి మరకలను చంద్రబాబుకు అంటించాలని చూస్తున్నాడు. జైల్లో పుట్టిన పార్టీ వైసీపీ. దేశానికి పాలన నేర్పిన నేత చంద్రబాబు. జగన్‌కు ఒక్క అవకాశం ఇచ్చినందుకు ఏపీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కేడీ జగన్ గురించి.. పైనున్న మోదీ ఆలోచించాలని నన్నూరి నర్సిరెడ్డి పేర్కొన్నారు.



# తప్పు చేశామని నిరూపిస్తే నడిరోడ్డుపై ఉరేసుకుంటాం

*(6వ పేజీ తరువాయి)*

కేసులు బనాయించారని మండిపడ్డారు. 10 సంవత్సరాలుగా కేసులుపై బయట తిరుగుతున్న వ్యక్తి ఈ ప్రపంచంలో ఏవరూ లేరన్నారు. మేము తప్పు చేయలేదు కాబట్టే అన్నీ డాక్యుమెంట్స్ చూపిస్తున్నామని వ్యాఖ్యానించారు. కల్తీ మద్యం తాగి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో 10 వేల మంది వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స పొందగా, విశాఖపట్నం జీజీహెచ్ లో 37 మంది చనిపోవడం బాధాకరమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక జగన్ వెంట సెక్షన్లు పరుగెడతాయని ఎద్దేవా చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో అక్రమాలకు సహకరిస్తున్న అధికారులను కూడా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. వారు రిటైర్ అయినా చర్యలు తప్పవన్నారు. చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించడాన్ని ప్రజలు సైతం జీర్ణించుకోలేక పోతున్నారని, 2024 ఎన్నికల్లో సీఎం జగన్ అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరాధారమైన కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. ఆనాడు రాజధానికి మద్దతు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమరావతిని విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడేందుకు టీడీపీతో కలిసి జనసేన పనిచేస్తుందని తెలిపారు.

ఈ నిరసన దీక్షలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు దామర్ల రాజు, కేసంనేని శ్రీఅనిత, వల్లభనేని వెంకట్రావు, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర టీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి బొంతు శివసాంబిరెడ్డి, రాష్ట్ర టీసీ సెల్ ఉపాధ్యక్షులు కాండ్రు శ్రీనివసరావు, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గాదె పిచ్చిరెడ్డి, రాష్ట్ర మహిళ కార్యదర్శి వింజమూరి ఆషాబాల, నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, నియోజకవర్గ టీసీ సెల్ అధ్యక్షులు కారంపూడి అంకమ్మరావు, నియోజకవర్గ తెలుగుయువత నాయకుడు పడవల మహేష్, తాడేపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కొయ్యగూర మహాలక్ష్మి, మహ్మద్ ఇబ్రహీం, పేరం ఏడుకొండలు, అన్నం నాగబాబు, వాకా మాధవరావు, అన్నె కుసుమా, దిండ్ల సత్యానందం, దామర్ల రాంబాబు, కృష్ణవందన, పాలది ఏసుదాసు, నల్లగొండ పరమేశ్వరరావు, బట్టు వెంకటేశ్వరరావు, తెనాలి మాణిక్యం, నెమలకంటి అనూష, ఎండీ జీలాలుద్దీన్, అప్పల శాంతి, యలమంచిలి పద్మజా, వాసా పద్మవతి, విశ్వనాథపల్లి ఉమాదేవి, బెజ్జం కుమార్, ఉన్నం ఝాన్సీ, గడ్డిపాటి తులసీ, అల్లూరి వసంతి, ముక్కపాటి కవిత, యలమంచిలి సింధూష, చిన్న సంతోష్ కుమార్, జాస్తి ప్రవీణ్, మన్నెం పద్మ, షేక్ నూరిల్లా, పాల అశోక్ యాదవ్, పారా రామకృష్ణ, తాతినేని వెంకట్, లాయర్లు తోట శివరాం ప్రసాద్ యాదవ్, జవ్వాది విజయ్ కుమార్, శ్రీ భాష్యం రఘునాథ్, కురపాటి బాబు అంబేద్కర్, జొన్నాదుల లెనిన్ బాబు, కురపాటి మురళీ రాజు, ఈన శ్రీనివాసరావు, వేమూరి రత్న ప్రసాద్, బేతపూడి నాయుడమ్మ, బుర్రముక్కల శివ రాజేష్ రెడ్డి, కట్టేపోగు కోటేశ్వరరావు, సామినేని వెంకట రేఖశ్రీ, రాచబత్తుని శ్రీనివాసరావు, కురగంటి రమేష్, మన్నెం వెంకయ్య, వడ్డేశ్వరం ప్రసాద్ రావు, మునగపాటి ప్రసాద్, ముక్కు పద్మ కళ్యాణి, గుడవల్లి ప్రదీప్ కుమార్, చిలకా హేమంత్, నెమలకంటి రజిని, జంజనం అమర్నాథ్, ముల్పూరి లేవిన్ బాబు, నంబూరు కోటేశ్వరరావు, రాజేష్, ఆషాబాల, రాచబత్తిన శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు కేసులతో.. జైల్లో తోసేస్తున్నారు!

- రాష్ట్రంలో రాజ్యాంగం, చట్టబద్ధ పాలన మృగ్యం
- పాలకుడు కక్షగడితే.. పోలీసులు చుట్టుముట్టి ఖైదు చేస్తున్నారు

అమరావతి: రాజ్యాంగం, చట్టం, ప్రజాస్వామ్యం ఏమీ ఉండవు. పాలకుడు ఎవరిపై కక్ష కడితే వారిని లోపల వెయ్యాల్సిందే. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అవినీతి మచ్చలేని మాజీ ముఖ్యమంత్రయినా, మాజీ మంత్రయినా సరే.. ఎవరు నచ్చకపోతే వారిని జైలుకు పంపించాల్సిందే. చైనాలో దేశాధినేతకు నచ్చని మంత్రులు, వ్యాపారవేత్తలు అకస్మాత్తుగా అదృశ్యమవుతుంటారు. అంతే..వారి ఆచూకీ ఇక దొరకదు. ఉత్తర కొరియాలో దేశాధినేతపై అసంతృప్తి వ్యక్తం చేస్తే ఇక ప్రాణాలతో ఉండే అవకాశం ఉండదు. అవి నియంతృత్వ దేశాలు కాబట్టి అలా జరుగుతుందని సరిపెట్టుకోవచ్చు. మరి మన రాష్ట్రానికి ఏమయింది. రాజ్యాంగం ఉంది.. చట్టబద్ధ పాలన ఉంది. అయినా పాలకుడికి నచ్చని, వ్యతిరేకంగా గళమెత్తే వాళ్లని పోలీసులు అక్రమంగా తీసుకెళ్లి లోపలెయ్యటాన్ని ఏమనాలి. బందిపోట్ల మాదిరిగా పోలీసులే గోడలు దూకి, తలుపులు బద్దలు కొట్టి మరీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న రాజకీయ నేతలను అరెస్టు చేసి ఈడ్చుకెళు తుంటే భారత రాజ్యాంగం ఈ రాష్ట్రంలో అమలు కాదా.. అమలు చేయకుండా మినహాయింపులేమైనా ఇచ్చారా అనే సందేహం వస్తోంది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు లో స్కామ్ పేరుతో ఏపీలో చంద్రబాబు చుట్టూ అల్లుతున్న కేసుల నాటకం చూస్తే ఎవరికైనా.. మన వ్యవస్థలు ఇంత బలహీనమా అనే సందేహం రాక మానదు. కళ్ల ముందు నిజాలన్నీ ఉన్నాయి. కానీ పాలకుడు.. తనకు అవసరమైన వరకు మాత్రమే నిజాల్ని బయటపెడుతున్నాడు. చెప్పిందే చెప్పి.. అబద్ధాన్ని నిజం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. జరుగుతున్న పరిణామాలను చూస్తే..చట్టం, న్యాయం అందరికీ సమానమేనని అనుకునేవారు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తప్పుడు కేసులతో ప్రతిపక్ష నేతల్ని అరెస్ట్ చేయడం నియంతృత్వమే. తప్పు చేస్తే ఆధారాలు చూపించి అరెస్ట్ చేయడం అనేది పోలీసుల మొదటి పని. సామాన్యులకైనా అదే చేయాలి. కానీ ఏపీలో ఏం జరుగుతోంది. ఎప్పుడో రెండేళ్ల కిందట నమోదు చేసిన కేసులో, ఎఫ్ఐఆర్‌లో కూడా పేరు లేని కేసులో పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా.. పదిహేనేళ్లు ప్రతిపక్ష నేతగా ఉంటూ వచ్చే ఎన్నికల కోసం ప్రజల్లోకి వెళ్తున్న నేతను అడ్డగోలుగా అరెస్ట్ చేసేశారు. ఓ ఎఫ్ఐఆర్ లేదు.. ఏ తప్పు చేశారో ఓ ఆధారం లేదు. కానీ అరెస్ట్ చేశారు. 73 ఏళ్ల వయసు ఉన్న ఆయనను 48 గంటల పాటు నిద్రపోనివ్వకుండా తిప్పారు. ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టు అన్నీ చివరి క్షణాల్లోనే ఇచ్చారు. ఆ కేసుకు సంబంధించిన ప్రతి వివరం పబ్లిక్ డోమైన్‌లో ఉంది. చంద్రబాబు అవినీతి చేశారన్న దానికి సాక్ష్యాలు లేవని సీఐడీ చెబుతోంది. అదో పన్ను ఎగవేత కేసని..అందులో ఎలాంటి అవకతవకలు లేవని.. అప్పటికే ఓ సారి హైకోర్టు కూడా చెప్పింది. అయినా సరే చంద్రబాబును జైల్లో పెట్టారు. అసలు ఆయన చేసిన తప్పేమిటో.. కోర్టులకూ సీఐడీ సరిగ్గా చెప్పలేకపోయింది. ఓ గొప్ప నేతను ఉద్దేశపూర్వకంగా కేసులో ఇరికించి జైల్లో పెట్టారని అర్థం అయిపోతుంది. స్కిల్ డెలవప్‌మెంట్ ప్రోగ్రాం మొత్తం కార్పొరేషన్ పేరు మీద నడిచింది. దీనికి ప్రేమచంద్రారెడ్డి అనే ఐఏఎస్ అధికారి చైర్మన్‌గా వ్యవహరించారు. ఈ వ్యవహారంలో కనీసం పది మంది ఐఏఎస్‌లకు భాగం ఉంది. ఈ ప్రాజెక్టును పూర్తిగా నడిపింది వారు.. ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు రోజు వారీ వ్యవహారాలను చూసుకుంటారా? పాలనా వ్యవస్థపై.. మన రాజ్యాంగంపై, చట్టాలపై ఏ మాత్రం అవగాహన ఉన్న వారికైనా.. ఈ కేసులో తప్పంటూ జరిగితే అది ఎవరిదో ముందుగానే అర్థం చేసుకుంటారు. కానీ వందల కోట్లు పెట్టి నీలి, కూలి , సోషల్ మీడియాను పోషిస్తున్న నయా నియంత పాలకులు.. తాము చెప్పేది మాత్రమే ప్రచారం చేస్తున్నారు. కానీ అందులో అసలు విషయాల జోలికి వెళ్లడం లేదు. కోర్టులో వాదనలు వినిపించకుండా దేశవ్యాప్తంగా ప్రెస్ మీట్లు పెట్టి చంద్రబాబు ప్రధాన నిందితుడని ప్రచారం చేస్తున్నారు.. ఎలా అనేది మాత్రం చెప్పడంలేదు.



ఇక తాజాగా మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి బండారు సత్యనారాయణ మూర్తిని ఇంటి గోడలు దూకి వెళ్లి మరీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆయనను అరెస్ట్ చేయాలని మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ డీజీపీకి లేఖ రాస్తే.. రెండు రోజుల తర్వాత అర్ధరాత్రి పూట రెండు వందల మంది పోలీసుల్ని బండారు సత్యనారాయణ ఇంటిపైకి పంపించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి బండారు ఇంటి వద్ద 200 మందికి పైగా పోలీసులు హడావుడి చేశారు. మంత్రి రోజాపై అసభ్య వ్యాఖ్యలు చేశారని.. గుంటూరు లో కేసు నమోదయిందని అరెస్టు చేసి తీరుతామని చెప్పారు. ఆ డ్రామా ఒక రోజుపైనే కొనసాగించారు. చివరికి గోడలు దూకి మరీ వెళ్లి బండారును అరెస్ట్ చేశారు. మంత్రి రోజా మామూలుగానే అసభ్యంగా మాట్లాడతారు. ఇటీవల మరీ దారుణంగా మాట్లాడటం ప్రారంభించారు. భువనేశ్వరి, బ్రాహ్మణిపైనా తన నోటి దురుసు చూపిస్తున్నారు. ఆమెకు మాజీ మంత్రి బండారు సత్యనారాయణ కౌంటర్ ఇచ్చారు. టీడీపీలో ఉన్నప్పుడు ఎలాంటి నిర్వాకాలు చేసిందో అన్నీ తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఇవి రోజాకు కోపం తెప్పించాయి . మహిళా మంత్రిపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా అని ఆమె ఆగ్రహించడంతో మహిళా కమిషన్ ను రంగంలోకి దించి లేఖ రాయించారు. పోలీసులు అరెస్టు కోసం మొత్తం బలగాలను వాడేస్తున్నారు. పవన్ తో పాటు చంద్రబాబును ఆయన కుటుంబసభ్యులను డబుల్ మీనింగ్‌లతో తరుచుగా రోజా విమర్శిస్తూ ఉంటారు. ఓ మహిళ అలా కూడా మాట్లాడుతుందా అని అందరూ ఆశ్చర్యపోతూంటారు అలాంటి మహిళా నేత. .. తనను దూషించారని అరెస్టులు చేయించడం ఆశ్చర్యంగా ఉంది. ఇలాంటి వాటికి అరెస్టులు చేయాలంటే వైసీపీ నేతలంతా జైల్లోనే ఉంటారని అంటున్నారు.

రాష్ట్రంలో జరుగుతున్న ఈ అక్రమ అరెస్టుల వ్యవహారం సామాన్యుడి గుండెల్లో మాత్రం రైళ్లు పరిగెత్తిస్తోంది. ఎంతో ప్రజాబలం, పలుకుబడి ఉన్న పెద్ద నాయకులకే ఈ పరిస్థితి వస్తే ఇక తమకు దిక్కెవరని బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరెత్తాలంటేనే భయపడే వాతావరణం సృష్టిస్తున్నారు. నియంత పాలకులకు కావాల్సింది కూడా ఇదే కదా. అయితే ప్రభుత్వంపై వ్యతిరేతను, తాము పడుతున్న బాధలు, కష్టాలను మౌనంగా భరిస్తున్న సామాన్యుడి చేతిలో ఓటు అనే బ్రహ్మాస్త్రం ఉందనే విషయం మాత్రం క్రూర పాలకులు గుర్తించటం లేదు.

## వైకామ నేతల బూతు కూతలపై ఎన్ని వేల కేసులు పెట్టాలి

- బండారు అరెస్టుపై లోకేష్ ఆగ్రహం



వైకామ పార్టీ ముఖ్యమంత్రి, మంత్రులు, నేతలంతా కూసే రోత, బూతు కూతలపై పోలీసులు ఎన్ని వేల కేసులు నమోదు చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతు కూతలు వద్దని హితవు పలికిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తిని మాత్రం టెర్రరిస్టులా అరెస్టు చేశారు. వైకామ పార్టీకి ఓ చట్టం, విపక్షాలకి మరో చట్టమా? ఇదేం అరాచక పాలన అని లోకేష్ మండిపడ్డారు. బండారు సత్యనారాయణ మూర్తి అరెస్ట్ తీవ్రంగా ఖండించారు.

## బండారు అరెస్టు అప్రజాస్వామికం: అచ్చెన్నాయుడు



తెలుగుదేశం నాయకుడు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అరెస్టు అప్రజాస్వామికమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. హద్దులు మీరి వ్యవహరిస్తున్న వైసీపీ నేతలను కట్టడి చేయకుండా.. ప్రతిపక్ష నేతలపై అక్రమకేసులు పెడుతున్నారు. తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేసే అంత నేరం ఏం చేశారు? వేధింపులు, కక్ష సాధింపులే అజెండాగా పాలన కొనసాగిస్తున్న జగన్‌కు ప్రజలే బుద్ధి చెప్పేరోజులు త్వరలోనే ఉన్నాయి. ప్రజల అభివృద్ధి, సంక్షేమం గాలికి వదిలేసి ప్రతీకార రాజకీయాల్లో మునిగితేలుతున్నారు. వైసీపీ నేతలు ఫిర్యాదు ఇచ్చిన గంటల వ్యవధిలోనే 4 జిల్లాలు దాటి బండారు ఇంటిపై దాడి చేసిన పోలీసులు.. టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదులపై ఎందుకు స్పందించరు? తాడేపల్లి డైరెక్షన్ లో అక్రమ కేసులు పెడుతున్న డీజీపీ భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించక తప్పదు. ప్రశ్నించే గొంతులను తొక్కుతున్న జగన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఓటుతో ప్రజలే తొక్కుతారని ఇక ప్రకటనలో అచ్చెన్నాయుడు హెచ్చరించారు.



తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో సత్యమేవ జయతే దీక్షలో కూర్చున్న పార్టీ కార్యాలయ సిబ్బంది, పార్టీ మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు




## ట్విట్టర్‌లో ఇండియా వైడ్‌గా 4వ స్థానంలో భువనమ్మ దీక్ష

చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ.. నారా భువనేశ్వరి చేసిన శాంతియుత దీక్ష దేశ వ్యాప్తంగా ట్విట్టర్‌లో నాలుగో స్థానంలో ట్రెండ్ అవుతోంది. భువనేశ్వరికి మద్దతుగా ట్విట్టర్ వేదికగా భువనమ్మ దీక్ష అనే యాష్ టాగ్‌తో వేల సంఖ్యలో నెటిజన్లు ట్వీట్స్ వేసున్నారు.చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను తెలుగు ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు.



చైతన్యరథం

# ఫ్యాక్షనిజానికి, పెత్తందారీకి ప్రతిరూపం జగన్

అదానీలు, అంబానీల్లాంటి కార్పొరేట్ దిగ్గజాలతో సావాసం చేస్తూ పేదలపక్షం అని జగన్ రెడ్డి మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఓ వైపు ప్రత్యేక విమానాల్లో విదేశాలకు పయనిస్తూ.. మరోవైపు హెలి కాప్టర్ లేనిదే కాలు బయటపెట్టని మీరే అసలైన పెత్తం దారు. నిజాలను మాట్లాడటం మర్చిపోయి ప్రతి రోజూ అబద్ధాలను వండివారిస్తూ గోబెల్స్ ను తలపి స్తున్నారు. ఆటో డ్రైవర్లకు సంబంధించిన వాహన మిత్ర, అమ్మ ఒడి, ఆసరా, చేయూత.. అదీ ఏ సభ అయినా అసంద ర్భంగా మాట్లాడటానికి ముఖ్యమంత్రి అలవాటుపడ్డా రు. లంచాలు, అవినీతి లేకుండా ప్రజలందరికీ మేలు చేస్తున్నామని మీరు చెప్పడం ఎంతో హాస్యాస్పదంగా ఉంది? మీ బిడ్డ ప్రభుత్వం ఒకవైపు, కేవలం దోచుకోవ డానికి మాత్రమే ఉన్న పెత్తందార్లు మరోవైపు నిలిచారు. 3లక్షల కోట్లు అక్రమంగా దోచుకుని.. దేశంలోనే సంపన్న ముఖ్య మంత్రిగా నిలిచింది మీరు కాదా? పేదల అనుకూల ప్రభుత్వానికి, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధం అని జగన్‌రెడ్డి వాపోతున్నారు. అసలు నిజమైన పెత్తందార్లు ఎవరో ప్రజలకు బాగా తెలుసు. నిరుపేదలకు అండగా నిలిచే మనసున్న ప్రభుత్వం ఒకవైపు, పేదలను వం చించిన మనసులేని గత పాలకులు మరోవైపు ఉన్నా రని జగన్మోహన్ రెడ్డి చెప్పడం చాలా ఎబ్బెట్టుగా ఉంది. మీ మాటలు వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుగా ఉంది. ప్రజలను మీరు చాలా తక్కువగా అంచనా వేస్తున్నారు.

ఫ్యాక్షనిజానికి, పెత్తందారీ పోకడలకు జగన్ రెడ్డి ప్రతిరూపం అని ప్రజలకు బాగా బోధపడింది. రాష్ట్ర మంత్రివర్గం నుంచి సలహాదారుల వరకు కేపటలిస్ట్ లు, ఫ్యాక్షనిస్టులే కనిపిస్తున్నారు. సామాజిక న్యాయం కోసం ఐదుగురు ఉప ముఖ్యమంత్రులను నియమించా మని ఆనాడు ప్రగల్భాలు పలికారు. కానీ వారికి ఇస్తున్న ప్రాధాన్యత ఏమిటో తెలియజేస్తే బాగుంటుంది. వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన మంత్రులు, కార్పొరేషన్ల చైర్మన్లు తమ బాధ్యతలను స్వేచ్ఛగా నిర్వహించుకునే అవకాశం లేకుండా చేశారు. వారిని గులాములుగా మార్చి వారిపై స్వారీ చేస్తున్నారు. సంబంధింత మంత్రులతో పని లేకుండానే సొంత సామాజికవర్గానికి చెందిన వ్యక్తులతో నిర్ణయాలు తీసుకుంటున్నారు. తమ వాళ్లను ఉన్నతమైన స్థానాల్లో కూర్చోబెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను వారి పాదాల దగ్గర మోకరిల్లేలా చేస్తున్న మీ వికృత క్రీడలు ప్రజలు గమనిస్తున్నారు. మంత్రి విశ్వరూప్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టడాన్ని ప్రజలందరూ వీక్షించారు. తిరుమల పర్యటనలో దళిత ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని అంటరానివా డిగా దూరంగా కూర్చోబెట్టడం చూశారు. వైవీ సుబ్బారెడ్డి కుర్చీలో కాలుమీద కాలువేసుకుని కూర్చొంటే ఉన్నత విద్యావంతురాలు, దళిత వర్గానికి చెందిన డాక్టర్ కోనేరు సత్యప్రియను ఆయన పాదాల దగ్గర నేలపై కూర్చోబెట్టారు. రాష్ట్రాన్ని కులాల వారీగా, మతాల వారీగా, ప్రాంతాల వారీగా విభజించింది మీరు కాదా? మూడు రాజధానుల ముసుగులో రాష్ట్రాన్ని ప్రాంతాల వారీగా విభజించారు. రాష్ట్రవ్యాప్తంగా మతవిద్వేషాలను నిత్యం రెచ్చగొడుతూనే ఉన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న కార్పొరేట్ కంపెనీలకు సైతం కులముద్ర వేసి తరిమివేసిన ఘనచరిత్ర మీది కాదా? కుల వ్యవస్థలో కనిపించే మానవ క్రౌర్యం, నియంతృత్వానికి మీరే చిరునామా. బూర్జువా భావజాల లక్షణాలు మీ అణువణువునా జీర్ణించుకుపోయాయి. ఓవైపు ప్రజలను దుర్భర పరిస్థితుల్లోకి నెడుతూ మరోవైపు కుల, మత, ప్రాంతీయ విద్వేషాలతో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు. ప్రజాస్వామ్యం ముసుగులో రాచరికం రాజ్యమేలుతోంది.

నీతివంతంగా అన్ని సామాజికవర్గాలకు, అన్ని ప్రాం తాలకు మంచిచేస్తున్నామంటున్నారు. కేవలం ఒక సామాజిక వర్గానికే అగ్రతాంబూలం ఇచ్చి కొన్ని ప్రాం తాలను మాత్రమే అభివృద్ధి చేస్తున్నారు. మీ సామా జికవర్గానికి చెందిన కొన్ని వందలమందికి పదవులు కట్టబెట్టడం వాస్తవం కాదా? ఇప్పుడు బడుగు, బలహీ నవర్గాలు అంటున్నారు. వారిలో ఎంతమంది కీలక మైన పదవులు ఇచ్చారు. రాష్ట్రంలో కుల వివక్షతతో పాలన సాగిస్తూ.. కులం చూడను, మతం చూడనని చెప్పడం విడ్డూరంగా ఉంది. మీకు 100 మంది సలహాదారులు ఉన్నారు. వీరిలో దాదాపు 20 మంది కేబినెట్ హెూదాలో కొనసాగుతున్నారు. బలహీన వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో దశాబ్దాలుగా అనుభవిస్తున్న 34% రిజర్వేషన్ 24శాతానికి కుదించడమే సామాజిక న్యాయమా? జగన్ రెడ్డి కుల అహంకారం కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీన వర్గాల వారికి 16,800 పదవులు దూరం అయ్యాయి. ఇది కాదా బీసీల తోకలు కత్తిరించడం?

ఎస్సీ, ఎస్టీలకు ఎంతో చేశామని ఊదరగొడుతు న్నారు. సబ్ ప్లాన్ నిధులు రూ.10వేల కోట్లను దారి మళ్లించారు. సబ్ ప్లాన్ నిధులు 50శాతం కూడా ఖర్చు చేయలేదు. కార్పొరేషన్లకు నిధులు ఇవ్వకపోవడంతో నాలుగేళ్లుగా ఒక్కరికి కూడా సబ్సిడీ రుణాలు అందలేదు. దళితులకు చెందిన 12వేల ఎకరాల అసైన్డ్ భూములు లాక్కొని వంచించారు. దళితులకు చెందిన 27 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను రద్దు చేశారు. 50వేల బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీచేయకుండా కాలయాపన చేస్తున్నారు. దళితులకు వర్తించే పారిశ్రామిక రాయితీలు కనుమరుగయ్యాయి. నాలుగేళ్లలో దళితులపై 6వేలకు పైగా దాడులు, నేరాలు జరిగాయి. ఎస్సీలపైనే అట్రాసిటీ కేసులు పెడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలు వారి కాలనీల్లో ఉంటేనే విద్యుత్ రాయితీ ఇస్తామంటున్నారు. అంబేద్కర్ విదేశీ విద్యను రద్దు చేశారు. జగన్ రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు చేసిన మోసాలకు ఇంతకంటే నిదర్శనాలు ఏం కావాలి? గత ప్రభుత్వ హయాంలో మూడున్నర కోట్లమందికి అందే కార్పొరేషన్ రుణాలను పేదవారికి దూరం చేశారు. ఇదేనా పేదవారిని రక్షించే తీరు.

ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావిస్తూ అమలుచేస్తున్నామంటున్నారు. మీ బిడ్డ ప్రభుత్వం ఒకవైపున నిలిస్తే.. ప్రజలను మోసగించేందుకు మరోవైపు ప్రత్యర్థులు వస్తున్నారంటున్నారు. మీరు పవిత్ర గ్రంథంలా భావిస్తున్న ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్ని అమలు చేస్తున్నారు? మద్యపాన నిషేధం చేసి ఎన్నికల్లో ఓట్లు అడుగుతామన్నారు. ఇది మీ ఎన్నికల మేనిఫెస్టోలోనిది కాదా? సీపీఎస్ రద్దు చేస్తామన్నారు, ఏడాదికి 5 లక్షల చొప్పున ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హెూదా సాధిస్తామన్నారు. అమరావతిని కొనసాగిస్తా మన్నారు. 2.30 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ, ఏటా జాబ్ కేలండర్, మెగా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. పన్నులు, ఛార్జీలు పెంచబోమన్నారు. ఇద్దరు పిల్లలకు అమ్మఒడి అన్నారు. మూడేళ్లలో కడప స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామన్నారు. ఇలా ప్రతి ఎన్నికల హామీని తుంగలో తొక్కారు. పైగా 99శాతం హామీలు అమలు చేశామన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారు. ఈ డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్లింది?

నాకు గజదొంగల ముఠా తోడులేదని అంటున్నారు. అసలు జగన్ రెడ్డి మంత్రివర్గమే పెద్ద గజదొంగల ముఠా. ఇక మీకు గజదొంగల తోడు ఎందుకు? నీలి మీడియా, కూలి మీడియా, మీ సొంత విషపత్రిక సాక్షి, మేధావుల ముసుగులో ఉన్న సామాజిక మాధ్యమాలు.. ఇవన్నీ మీవి కాదా? ప్రభుత్వ సంపద దోచుకోవడానికి విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను సామంత రాజులుగా నియమించుకున్నారు. వారితో పంచుకుని దంచుకుతింటున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, ఇడుపులపాయ, కడప, తాడేపల్లిలో భారీ ప్యాలెస్ లు నిర్మించుకున్నారు. మీరెట్లా పేదల ముఖ్యమంత్రి అవుతారు? జగన్ రెడ్డి కుట్రలను, కుతంత్రాలను నమ్ముకుని ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. పైకి మాత్రం దేవుడుని, ప్రజలను నమ్ముకున్నానని పేద పలుకులు పలుకుతున్నారు. ప్రత్యర్థులను జైలుకు పంపించడం, అంతమొందించడం ద్వారా అధికారంలోకి రావాలని పథక రచన చేస్తున్నారు. అందుకే చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైలుకు పంపారు. లోకేష్ ను కూడా జైలుకు పంపడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఏదేమైనా ఇంతటి అరాచకం, హింస పెత్తందార్లు, ఫ్యాక్షనిస్టులకు మాత్రమే సాధ్యపడుతుంది. ఇకనైనా మీ చెర నుంచి సామాజిక న్యాయానికి విముక్తి కలిగించాలి. మీరు మొసలి కన్నీరు కార్చడం ఆపి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పవిత్ర గ్రంథంలా భావిస్తున్న మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చాలి. నిజంగా వచ్చేది ఎన్నికల కురుక్షేత్ర యుద్ధమే. పెత్తందార్లకు ప్రతినిధిగా ఉన్న జగన్ రెడ్డికి, పేదలకు మధ్య జరిగే ఈ యుద్ధంలో పేదలు గెలవాలని కోరుకుందాం.

**- మన్నవ సుబ్బారావు**

## లాస్ ఏంజిల్స్‌లో తెలుగు వారి ఆందోళన




అమెరికా (చైతన్యరథం): స్కిల్ డెవల ప్మెంట్ కేసులో మాజీ ముఖ్య మంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ దేశ, విదేశాల్లోనూ నిరసనలు కొనసాగుతున్నాయి. తాజాగా ఆయనకు మద్దతుగా అమెరికాలోని లాస్ ఏంజిల్స్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. చంద్రబాబునాయుడి అక్రమ అరెస్టుకు సంఘీభావంగా లాస్ ఏంజిల్స్ నివసించే తెలుగువారు.. 'వీ స్టాండ్ విత్ సీబీఎన్', 'గొప్ప కలలు కనడం నేర్పాడు.. మేము కన్న కలలు నెరవేర్చా డు' అని రాసి ఉన్న ప్లకార్డులు పట్టుకుని.. ఆ ప్రాంతమంతా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వ హించారు. నల్ల మాస్కులు ధరించి వారి బాబు అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. 'వీ స్టాండ్ విత్ సీబీఎన్' అంటూ నినా దాలు చేశారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు మచ్చలేని చంద్రుడిలా త్వరలోనే రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి బయటికి వస్తారని ర్యాలీ చేసిన ప్రవాస భారతీయులు ఆకాంక్షించారు.

## బ్రిటీష్ రూల్ పోయింది.. సైకో రూల్ వచ్చింది

- గాంధీజీ బ్రతికి ఉంటే.. రాష్ట్ర పరిస్థితి చూసి చనిపోయే వారు
- గాంధీజీ సాధించిన స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా పాలన జరుగుతోంది
- సత్యమేవ జయతే దీక్షా కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ వ్యాఖ్యలు



ధర్మవరం (చైతన్యరథం): దేశంలో బ్రిటీష్ రూల్ పోయి చాలా ఏళ్లైందని.. కానీ గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో సైకో రూల్ సాగుతోందని ధర్మవరం నియోజకవర్గ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో గాంధీ జయంతి సందర్భంగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ధర్మవరంలో సత్యమేవ జయతే దీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పరిటాల శ్రీరామ్ గాంధీ సర్కిల్లో ఉన్న మహాత్ముని విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రతి ఏటా అక్టోబర్ 2న గాంధీజీ గురించి, ఆయన సాధించిన స్వతంత్ర్యం గురించి మాట్లాడుకునే వారమని.. కానీ ఈ రోజు దెబ్బతిన్న వ్యవస్థలు, దుర్మార్గపు పాలన గురించి మాట్లాడుకోవాల్సిన ఖర్మ పట్టిందన్నారు. గాంధీజీ తెచ్చిన స్వాతంత్ర్యం రాష్ట్రంలో లేదని.. మనం నిర్మించుకున్న చట్టాలు, న్యాయాలు పని చేయడం లేదన్నారు. ఆయన ప్రాణ త్యాగం చేసి తెచ్చిన స్వాతంత్ర్యం రాష్ట్రంలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. దాని కంటే గొప్పగా జగన్ చేస్తున్న పనులు కనిపించే స్థాయికి తీసుకొచ్చారన్నారు. ఒకవేళ గాంధీజీ బ్రతికే ఉంటే.. ఇలాంటి పరిస్థితులు చూసి ఆయన గుండె పగిలి మరణించి ఉండే వారన్నారు. ఇప్పుడు కూడా ఆయన పై నుంచి చూస్తూ ఇందుకోసమా నేను స్వాతంత్ర్యం తెచ్చింది..ఇందుకోసమా నేను పోరాటం చేసిందని బాధపడుతుంటారన్నారు. ఈ రోజు జగన్ చేస్తున్న సైకో పనుల వలన చంద్రబాబు అన్యాయంగా జైల్లో ఉన్నారు. అందుకే గాంధీ జయంతి రోజున జైలులోనే సత్యాగ్రహ దీక్ష చేస్తున్నారని.. బయట నారా భువనేశ్వరి, బ్రాహ్మణి కూడా దీక్షలు చేస్తున్నారన్నారు. ఈ పరిస్థితులన్నీ ప్రజలు గమనించాలని.. ప్రతి ఒక్కరూ బయటకు వచ్చి ప్రశ్నించాల్సిన అవసరం ఉందని శ్రీరామ్ అన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల ఎన్ఐఏ సోదాలు

తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు జరుపుతోంది. సోమవారం తెల్లవారక ముందే స్థానిక పోలీసుల సహకారంతో భారీ ఎత్తున తనిఖీలు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లో దాదాపు 60 ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు జరిపింది. మావోయిస్టులకు సహకరిస్తున్నారనే ఆరోపణలతో ఈ సోదాలు నిర్వహించారు. గుంటూరు జిల్లా పొన్నూరులో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజారావు నివాసంలో సోదాలు చేపట్టారు. పొన్నూరులో రాజారావు ప్రజావైద్యశాల, నెల్లూరులోని ఉస్మాన్ సాహెబ్ పేటలో ఏపి పౌర హక్కుల సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు ఇంట్లో ఎన్ఐఏ బృందాలు సోదాలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరహక్కుల సంఘం నాయకులు, న్యాయవాదుల ఇళ్లలో ఎన్ఐఏ సోదాలు జరుపుతోంది. హైదరాబాద్‌లో పౌరహక్కుల సంఘం నాయకుడు, న్యాయవాది సురేష్ ఇంట్లో తనిఖీలు చేపట్టారు. న్యాయవాది సురేష్‌తో పాటు అతని బంధుమిత్రుల ఇళ్లలో సోదాలు జరుపుతున్నారు. తిరుపతిలో న్యాయవాది క్రాంతి చైతన్య నివాసంలో సోదాలు చేపట్టారు. హైదరాబాద్‌లో పౌరహక్కుల సంఘం నాయకురాలు భవానీ నివాసంలో సోదాలు జరిపారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో కుల నిర్మూల పోరాట సమితి నాయకుడు దుడ్డు వెంకట్రావు నివాసంలో సోదాలు నిర్వహించారు.

శ్రీకాకుళంలో కులనిర్మూలన పోరాట మిస్కా కృష్ణయ్య నివాసంలో సోదాలు చేపట్టారు. నెల్లూరులో పౌర హక్కుల సంఘం నాయకులు అరుణ, వెంకటేశ్వరరావు నివాసంలో సోదాలు నిర్వహించారు. విజయవాడలో కూడా ఎన్ఐఏ సోదాలు జరుగుతున్నాయి. విజయవాడ శివార్లలోని పినైనవరం గ్రామంలో చైతన్య మహిళా సంఘం నాయకురాలు రాధ ఇంట్లో ఎన్ఐఏ సోదాలు జరుపుతోంది. విజయవాడ చిట్టినగర్‌లో అడ్వకేట్ అరసవిల్లి కృష్ణ, పూర్ణనందం పేటలో అడ్వకేట్ అంజనేయులు నివాసాల్లో ఎన్ఐఏ సోదాలు నిర్వహిస్తోంది. వీరికి నోటీసులు ఇచ్చి, అవసరమైతే అరెస్ట్ చేస్తారని చెబుతున్నారు.

# న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించే బాధ్యతను ప్రజలే తీసుకోవాలి

## ఏపీలో ఆటవిక రాజ్యం నడుస్తోంది - అమెరికా వాషింగ్టన్ డీసీలో తెలుగు మహిళల నిరసన దీక్ష

వాషింగ్టన్ డీసీ(అమెరికా): న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించాలని సాయి సుధ పాలడుగు, మంజు గోరంట్ల అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో మహిళల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని చంద్రబాబుకు మద్దతుగా తమ సంఘీభావం తెలియజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని సాయి బొల్లినేని, భాను మాగులూరి సమన్వయ పరిచారు. ఈ సందర్భంగా సాయి సుధ పాలడుగు మాట్లాడుతూ... తెలుగువారిని అభివృద్ధి పథంలో నిలిపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన దార్శనికుడు చంద్రబాబును ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు.



కక్షసాధింపులకు రాష్ట్రాన్ని వేదికగా చేసుకున్నారన్నారు. విధ్వంస ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రవాసాంధ్రులు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. మంజు గోరంట్ల మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో తెలుగువారు రాణించేందుకు చంద్రబాబు చేసిన కృషే కారణం. సైబరాబాద్ నిర్మించి ఐటీ విప్లవం సృష్టించడం ద్వారా లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. అలాంటి చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించే బాధ్యతను ప్రజలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో.. అనిత మన్నవ, దీప్తి మాగులూరి, శైలజ బొల్లినేని, ఇందిర చలసాని, శిరీష నర్రా, శ్వేత కావూరి, శాంతి పారుపల్లి, సరిత పోసాని, వల్లి వల్లు, శ్రీలత నార్ల, బిందు బొల్లి, శ్రీవిద్య సోమ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ, విజయవాడలోని స్వగృహంలో "సత్యమేవ జయతే" నిరాహార దీక్ష చేస్తున్న వర్ల రామయ్య కుటుంబ సభ్యులు

## కర్ణాటక కారటగిలో చంద్రబాబు అభిమానుల ర్యాలీ

### కారటగి నుంచి గంగావతికి దండయాత్ర

గంగావతి, కారటగి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా అఖండ గంగావతి తాలూకా తెలుగు ప్రజలు, చంద్రబాబు అభిమానులు ఆదివారం కారటగి నుంచి గంగావతికి భారీ ప్రదర్శన నిర్వహించారు. కారటగి ప్రాంతంలోని బసవణ్ణ క్యాంపు, సాలుంచిమర, యరడోణ కిందిక్యాంపు, హుల్కిహాళ క్యాంపు, జూరట, దేవి క్యాంపు తదితర గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, కార్లలో 30 కిలోమీటర్ల దూరంలోని గంగావతికి బయ లుదేరారు. చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. మర్గానహళ్లి, సిద్దాపుర గ్రామాల మీదుగా ర్యాలీ శ్రీరామనగర్ చేరుకుంది. అక్కడ శ్రీరామనగర్, అయోధ్య, తామ్రపల్లి పు, ముష్టూరు క్యాంపు, కోటయ్య క్యాంపు హెసకేర గుండూరు క్యాంపు, హణవాళ క్యాంపు, జీరాల కల్లుడి క్యాంపు తదితర గ్రామాల ప్రజలతో అక్కడి నుంచి ర్యాలీ జంగమర కల్లుడి చేరు మజ్జిగ పంపిణీ చేశారు. చంద్రబాబును తప్పుడు కేసులు బనాయించి జైల్లో పెట్టడం, అరెస్టు చేశాక కేసు నమోదు చేయడం హిట్లర్ పాలనను గుర్తుకు తెస్తుందని శ్రేణులు మండిపడ్డారు. ప్రజాస్వామ్య దేశంలో పాలకులు ఇలా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం విచారకరం. చంద్రబాబును విడుదల చేసేవరకు తమ పోరాటం ఆగదన్నారు. తెలుగు సమాఖ్య నాయకుడు గారపాటి రామకృష్ణ ఈ కార్యక్రమంలో కంట తడి పెట్టుకున్నారు. నాయకులు కుడతిని రాము, నెక్కంటి శ్రీనివాస్, ముష్టూరు క్యాంపు సతీష్, కొరిపల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ : మాజి మంత్రి కన్నా



సత్తెనపల్లి చైతన్యరథం: సత్తెనపల్లి రూరల్ మండలంలోని కొమెరపూడి గ్రామంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సత్తెనపల్లి ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ "క్యాండిల్ ర్యాలీ" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రాజకీయ కక్షతో చంద్రబాబుపై పెట్టిన కేసును ఖండిద్దాం... తప్పుడు కేసులుపై గళమెత్తుదాం...జగన్ కుట్రను ఎండగడదాం.. బాబుతో నేను అని చాటి చెబుదాం అనే కరపత్రాలను గ్రామంలోని పెద్దలతో కలిసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు అళ్ల అమరేశ్వర రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యవసాయానికి టిడిపి అండ.. నేడు వైసీపీ పెద్ద గుదిబండ

రాయదుర్గం చైతన్యరథం: నిత్య కరవులకు నిలయమైన రాయదుర్గం ప్రాంతంలో భూగర్భ జలాలను పెంచి వ్యవసాయాన్ని బతికించాలని తన హయాంలో పెద్ద ఎత్తున చెక్ డ్యాంలను నిర్మించామని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ ఛాలెంజిలో భాగంగా టిడిపి హయాంలో నిర్మించిన సోమలాపురం చెక్ డ్యాం వద్ద సోమవారం ఆయన 25వ సెల్ఫీ వీడియో విడుదల చేశారు. 2014-19 మధ్య కాలంలో భూగర్భ జలాలను పెంచడంలో భాగంగా నీటి కుంటలు, చెక్ డ్యాంలు,చెరువుల్లో పూడిక తీత, చెరువుల మరమ్మతుల కోసం రూ.58.42 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాయదుర్గం నియోజకవర్గ చరిత్రలో ఎప్పుడు ఎవరూ చేయలేనన్ని అభివృద్ధి కార్యక్రమాలు తన హయాంలో జరిగాయనడానికి చెక్ డ్యాంలే నిదర్శనమన్నారు. ప్రవహిస్తున్న నీటికి అడ్డుకట్ట వేసి, భూగర్భ జలంగా మార్చడంతో పాటు రైతుల బోర్లలో నీటి మట్టం పెరగడానికి చెక్ డ్యాంలు ఎంతో దోహదపడతాయన్నారు. నియోజకవర్గంలో ఎండిపోయిన వేలాది బోర్లు రీఛార్జ్ కావడంతో పాటు ఏడాది పొడవునా సాగునీటిని సరఫరా చేసే పరిస్థితిని అప్పట్లో తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

2014-19 మధ్య కాలంలో తాము చేసిన అనేక వినూత్న కార్యక్రమాల ఫలితాలు ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. రైతు బాగు కోసం టీడీపీ హయాంలో చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా ఆనాడు రైతులే మెచ్చుకున్నారన్నారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న కాపు రామచంద్రారెడ్డి రైతుల కోసం ఎన్ని కోట్లు ఖర్చు చేశాడో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో రైతు కోసం చేస్తున్న అభివృద్ధి పనులపై అనాడు ప్రతి పక్షనేతగా



- సెల్ఫీ ఛాలెంజిలో కాలవ ఎద్దేవా

ఉన్న "కాపు" లోకాయుక్తకు తప్పుడు ఫిర్యాదులు చేశాడని దుయ్యబట్టారు. పనులను అడ్డుకోవడంతో కాంట్రాక్టర్లకు బిల్లులు రాకుండా కుటిల ప్రయత్నాలు చేసిన అభివృద్ధి నిరోధకుడు కాపు రామచంద్రారెడ్డి అన్నారు. లేహ్యా బుద్ధితో ఆనాడు నీరు- చెట్టుపై కాపు చేసిన తప్పుడు ఫిర్యాదుపై విచారించిన సంబంధిత అధికారులు సదరు పనులు భేషుగ్గా ఉన్నట్లు తేల్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు చెప్పు కోవడానికి బోలెడు ఉన్నాయని, ఎమ్మెల్యే "కాపు" చెప్పుకోవడానికి ఒక్కటైన ఉందా అని కాలవ శ్రీనివాసులు నిలదీశారు.

## నారావారిపల్లిలో నారా వారి కుటుంబీకుల "సత్యమేవ జయతే దీక్ష"



చంద్రగిరి (చైతన్యరథం): చంద్రబాబు చేపట్టిన "సత్యమేవ జయతే దీక్ష" ఒక్కరోజు నిరాహార దీక్షలో చంద్రబాబుకు మద్దతుగా నారా కుటుంబ సభ్యులు, పులివర్తి సుధా రెడ్డి నారావారిపల్లెలో చంద్రబాబు నాయుడు ఇంటి ముందర కూర్చొని ఒక్కరోజు నిరాహారదీక్ష చేపట్టారు. సత్యమేవ జయతే అనే సిద్ధాంతంతో తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతున్నదని టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి సుధా రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో

**"సత్యమేవ జయతే దీక్ష"లో పాల్గొన్న పులివర్తి సుధా రెడ్డి...**
**నారావారిపల్లెలో చంద్రబాబు నివాసం వద్ద బైఠాయించి చేపట్టిన ఒక్కరోజు నిరాహార దీక్ష**

సోమవారం చేపట్టిన దీక్షకు మద్దతుగా ఆయన సొంత గ్రామమైన నారావారిపల్లెలో చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా చేరుకుని గాంధీ జయంతి సందర్భంగా ఒక్కరోజు నిరాహార దీక్షను చేపట్టారు. సుధా రెడ్డితో పాటు పలువురు నాయకులు సంఘీభావం తెలిపారు. ర్యాలీగా వచ్చిన మహిళలు, నాయకులు, యువత ముందుగా నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల వద్ద పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం చంద్రబాబు ఇంటి ముందు బయటాయించి తాము సైతం చంద్రన్నకు తోడుగా అంటూ "సత్యమేవ జయతే దీక్ష"ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధా రెడ్డి మాట్లాడుతూ వైసిపి అరాచకానికి పాల్పడుతున్నప్పటికి చంద్రబాబు గాంధీజీ సిద్ధాంతాలను ఎంచుకున్నారని అన్నారు. చంద్రబాబుది అభివృద్ధి పథం అయితే,వైసిపి ది వినాశక తిరోగమన పథం అని విమర్శించారు. రాష్ట్రంలో గత 4 సంవత్సరాల నుంచి రాజ్యాంగానికి విలువలు, మహనీయుల త్యాగాలకు నీడ లేకుండా పోయిందని సుధా రెడ్డి హెచ్చరించారు. లక్షలాదిమంది యువతకి సాంకేతిక విద్యలో నైపుణ్యాలు నేర్పించి, వేలాదిమందికి దేశ విదేశాలలో ఉపాధి అవకాశాలను కల్పించిన పుణ్యానికి చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారు అయితే అహింసా వాదంతో ఆనాడు దేశ సంపదను కొల్లగొడుతుండిన తెల్లదొరలను తరిమికొట్టారని, అదే స్ఫూర్తితో ఈనాడు రాష్ట్ర సంపదను కొల్లగొడుతూ... రాష్ట్రంను రావణ కాష్టంగా మార్చిన అందరికీ 2024 ఎన్నికలలో సమాధానం చెబుతామని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం "సత్యమేవ జయతే దీక్ష"లో ఒక్కరోజు నిరాహార దీక్షలో పాల్గొని సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందించి ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారావారిపల్లి పరిసర ప్రాంత గ్రామస్తులు, మహిళలు, యువత, నాయకులు పాల్గొన్నారు.

# విజయవాడ సెంట్రల్‌లో కాగడాలతో నిరసన ప్రదర్శన: బోండా ఉమా

విజయవాడ చైతన్యరథం: చంద్రబాబు అక్రమ అరెస్టుకి నిరసనగా సెంట్రల్ నియోజకవర్గ మహిళా కమిటీ ఆధ్వర్యంలో టిడిపి పోలిట్ బ్యూరోసభ్యులు ,సెంట్రల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి అనంతరం కాగడాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్టు, పార్టీ శ్రేణులపై జరిగిన దమనకాండ, జగన్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో కాగడాల ప్రదర్శన చేసినట్లు చెప్పారు. రాష్ట్రం కోసం, దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసి ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడిన చంద్రబాబుని ఇన్ని ఇబ్బందులు పెట్టడం చాలా దురదృష్టకరమన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా సమాజం అనే దేవాలయంలో ప్రజలనే దేవుళ్ళుగా పూజిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై రాజకీయ కక్ష సాధింపులు పరాకాష్టకి చేరాయన్నారు. నియంతలా సైకో జగన్ సాగిస్తున్న విధ్వంస పాలనపై ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ, ఏపీలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చేపట్టి మహోద్యమంగా మార్చిన చంద్రబాబుపై తప్పుడు కేసులు బనాయించి, అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి ఉదయశ్రీ, పైడి తులసి, ఫిరియా జగదాంబ, ఎరుబోతు శ్రావణి,సందిరెడ్డి గాయత్రి,లబ్బా దుర్గ, దాసరి కనకారావు, పిరియా సోమేశ్వరరావు, భాగ్యలక్ష్మి , రుక్మిణి , గౌసియా , ఇంద,,తొట్టెంపూడి ఉదయ్ సెంకర్, బెజ్జం జయపాల్,శివకుమారి,హరి కుమారి, ఇందిర,సుల్తాన, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

**- టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్**



అమరావతి (చైతన్యరథం): చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులపై కేంద్రం జోక్యం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ డిమాండ్ చేశారు. చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపితే ఎవరు కూడా బాధపడటం లేదని మాజీమంత్రి పేర్నినాని అనడాన్ని తీవ్రంగా ఖండించారు. చంద్రబాబు ఎలాంటి తప్పు చేయకపోయినా... ఎలాంటి ఆధారాలు లేకుండానే చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపించడాన్ని దేశవ్యాప్తంగా ఉన్నా ఇతర దేశాల్లో ఉన్నా తెలుగు కన్నడ, తమిళ ప్రజలు, ఉద్యోగులు, యువత, మహిళలు విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. పేర్ని నానికి కళ్ళు మూసుకుని చంద్రబాబును అరెస్ట్ చేస్తే ఎవరూ బాధపడటం లేదని నాని అనడం దుర్మార్గమన్నారు. చంద్రబాబు కాపులకు ఎంత మేలు చేశారో? నానికి తెలియదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో కాపులకు ఎంతో మేలు జరిగిందని, రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వేయి కోట్లు నిధులను కేటాయించారని తెలిపారు. జగన్ నిరంకుశ పాలన నుండి రాష్ట్రానికి విముక్తి కలగాలని కోరుతూ సోమవారం గాంధీ జయంతి రోజు అన్ని రాష్ట్రాల్లో అన్ని దేశవ్యాప్తంగా ప్రజలు అన్ని రాజకీయ పార్టీలు నిరాహార దీక్షలు చేస్తున్నారని, చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని అయన డిమాండ్ చేశారు. మోత మోగిద్దాంలో పాల్గొన్న వారిపై పోలీసులు కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు.

## వైసీపీ తాటాకు చప్పుళ్ళకు టీడీపీ భయపడదు

**- మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు**



నెల్లూరు చైతన్యరథం: అధికార దాహంతో కొట్టుమిట్టాడు తున్న వైసీపీ ప్రభుత్వానికి త్వరలోనే రాష్ట్ర ప్రజలు బుద్ధి చెబుతారని, వైసిపి తాటాకు చప్పుళ్ళకు తెలుగుదేశం పార్టీ భయపడదని ఉదయగిరి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు బొల్లినేని వెంకట రామారావు పేర్కొన్నారు.ఈ సంధ్బంగా అయన బస్టాండ్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించి చంద్రబాబును ఎన్ని రోజులు జైల్లో పెడతారంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పరిపాలన సాగుతుందని ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. అధికారులను ప్రజలను భయ భ్రాంతులకు గురిచేసి రాజ్యమేలుతున్నారని వైకాపా ప్రభుత్వంపై మండిపడ్డారు. 2024 ఎన్నికల్లో వైసిపి రాష్ట్రంలో తుడిచిపెట్టుకొని పోవడం ఖాయం అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన అధికారంలోకి రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు రాక కొరకు ఎదురు చూస్తున్నారని నైతిక విలువలు పాటించే చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడం దారుణం అన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మీ పరిస్థితి ఏమిటో తెలుసా అంటూ వైకాపా నాయకులను ఉద్దేశించి సూటిగా ప్రశ్నించారు.

# తాడేపల్లి ముఠా కుట్రలో భాగమే చంద్రబాబుపై అక్రమ కేసులు

**- విజయవాడ దీక్ష పాల్గొన్న కృష్ణా జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్**



విజయవాడ (చైతన్యరథం): నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబుపై కేసులు తాడేపల్లి ముఠా కుట్రకు పాల్పడుతోందని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి నెట్టెం రఘురామ్ వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా సోమవారం కృష్ణా జిల్లా వ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన నిరాహార దీక్షలకు రఘురామ్ తన సంఘీభావాన్ని తెలియజేశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దీక్షలో పాల్గొన్న అయన మహాత్మా గాంధీ చిత్రపటానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, తూమాటి ప్రేమనాద్, గద్దె అనురాధ, జాస్తి సాంబశివరావు, దేవినేని అపర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నెట్టెం రఘురామ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో అరాచక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తూ ఒక ప్రక్క చంద్రబాబు, మరోపక్క యువనేత లోకేశ్‌లు రాష్ట్ర ప్రజలను చైతన్యవంతం చేసే పనిలో ఉంటే భరించలేని సైకో జగన్‌రెడ్డి తన పదవి ఊడి పోయే పరిస్థితిని అంచనా వేసుకొని ఏమి చేయాలో పాలుపోక ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 నెలలు జైల్లో ఉన్న సైకో జగన్‌రెడ్డి చంద్రబాబును ఒక్క రోజయినా జైల్లో ఉంచాలనే పన్నాగంలో భాగంగానే తాడేపల్లి ముఠా కుట్రతో ఈ దుర్మార్గాలకు పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. రాజమండ్రి జైల్లో ఉన్నా చంద్రబాబుకు రాష్ట్రం, రాష్ట్ర ప్రజల గురించే ఆలోచనలు తప్ప తనపై అక్రమ కేసులు పెట్టినందుకు కించిత్ భయపడట్లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన, సిపిఎం పార్టీ నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. గత 25 సంవత్సరాలుగా చంద్రబాబు గారి విధానాల వల్ల బాగా ఉన్నతికి వచ్చిన లక్షలాది మంది ఈరోజున దేశం, రాష్ట్రమే కాకుండా ప్రపంచ నలుమూలలా ప్రస్తుత పరిస్థితిపై పోరాట రూపంలో నిరసన తెలియజేస్తున్నారు, ఇంత ఉద్యమాన్ని జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఊహించి ఉండడు, ప్రజాసేవ పేరుమీద ఎన్నికై ఓట్లు తీసుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత తన ధర్మాన్ని మర్చిపోయిన జగన్‌ను అంధ్ర రాష్ట్ర ప్రజలు రాబోయే ఎన్నికల్లో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు.

# జగన్ పరిపాలన చూసి ప్రజాస్వామ్యం సిగ్గు పడుతుంది

**గుంటూరులో సత్యమేవ జయతే నిరసన కార్యక్రమం**



గుంటూరు (చైతన్యరథం): గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యాన్ని జగన్ రెడ్డి కూకటి వేళ్లతో పెకిలించివేసాడని, సత్యానికి సంకెళ్లు వేసి అరాచకం సృష్టిస్తున్నారని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ ఇన్ ఛార్జ్ కోవెలమూడి రవీంద్ర అధ్వర్యంలో సత్యమేవ జయతే నిరాహార దీక్ష చేపట్టారు. చేతికి సంకెళ్లు... కళ్ళకు రిబ్బన్ కట్టుకొని నిరసన తెలిపారు. ఈ దీక్షకు గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు వై.వి అంజనేయులు, మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, ఏ.ఎస్ రామకృష్ణ, దేగల ప్రభాకర్ బుచ్చిరామ్ ప్రసాద్, కూచిపూడి విజయ తదితరులు తమ సంఘీభావం తెలిపి నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... టీడీపీ అధినేతపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, జగన్ రెడ్డి పరిపాలనలో న్యాయం, ధర్మం, నీతి, నిజాయతీ పూర్తిగా చచ్చిపోయయన్నారు. భారత రాజ్యాంగంలో ఐపీసీ సెక్షన్ అమలులో ఉంటే ఏపీలో మాత్రం జేపీసీ సెక్షన్ అమలు జరుగుతోందన్నారు. రాష్ట్రం వ్యవస్థలన్ని పూర్తిగా నిర్వీర్యం కావడంతో ప్రజాస్వామ్యం సిగ్గు పడుతుందన్నారు. చంద్రబాబు తన రాజకీయ చరిత్రలో ఒక్కసారి కూడా తప్పు చేయలేదని, అటువంటి వ్యక్తిపై ఆరోపణలతో కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. రాబోయే రోజుల్లో వైసీపీకి కూడా ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

**రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోంది: కోవెలమూడి రవీంద్ర**

రాష్ట్రంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కాకుండా రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.43 వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్న జగన్ రెడ్డి... 16 నెలలు పాటు జైల్లో ఉన్నారని అన్నారు. అలాంటి వ్యక్తం నిజాయితీపరుడైన చంద్రబాబుపై అధారాలు లేని కేసులో అక్రమ అరెస్టుకు పాల్పడ్డారని తెలిపారు. జగన్ రెడ్డి అరాచకాల్ని ప్రపంచానికి తెలియజేస్తున్న చంద్రబాబుపై కక్షగట్టి కేసులు పెట్టారని అన్నారు. ఎవరు ఎన్ని అక్రమ కేసులుపెట్టినా చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్మినేని కోటేశ్వరావు, ఈరంటి వర ప్రసాద్, వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, నుకావరపు బాలాజీ, మద్దిరాల మ్యాని తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో సత్యమేవ జయతే నిరసన దీక్ష



తిరుపతి చైతన్యరథం: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చూపిన సత్యమేవ జయతే మార్గంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా చంద్రబాబుకు సంఘీభావంగా నారా భువనేశ్వరి, లోకేష్ బాబుల నిరాహార దీక్షకు మద్దతుగా తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు గొల్ల నరసింహయాదవ్, తిరుపతి తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయం నందు అమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు ఏనాడు కూడా వేలెత్తి చూపనట్టుగా ఒక్క రూపాయి కూడా ప్రజల డబ్బుకు ఆశపడకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా మచ్చలేని రాజకీయ నాయకుడిగా 14 ఏళ్ళు ముఖ్యమంత్రి పదవిని అలంకరించారని అన్నారు. అటు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్లోగాని విభజన ఆంధ్ర ప్రదేశ్లో గాని అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ ప్రజలకి సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన అందించిన మహా నాయకుడు అన్నారు. రాజకీయ కక్షతో ఎలాంటి అధారాలు లేని కేసులు పెట్టి నిర్భంధించిన తీరును ప్రపంచవ్యాప్తంగా ఈరోజు చంద్రబాబుకి సంఘీభావం తెలియజేస్తూ వెంటనే విడుదల చేయాలని అక్రమ కేసులు కొట్టేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కూడా నిరసన దీక్షలో కొనసాగిస్తూ ప్రేమాభిమానాలు పొందుతున్న చంద్రబాబు మార్చలేని నీతిగల నాయకుడిగా విడుదలవుతారని తెలిపారు. నరసింహ యాదవ్ అమరణ నిరాహార దీక్ష మద్దతుగా సిపిఐ పార్టీ తరుపున జిల్లా అధ్యక్షులు రామానాయుడు జిల్లా కమిటీ సభ్యులు, జనసేన పార్టీ తరపున తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ కిరణ్ రాయల్ కమిటీ సభ్యులు మద్దతు ఇచ్చారు.

# న్యాయం జైల్లో ఉంది... అన్యాయం పాలన సాగిస్తోంది

- లక్ష కోట్లు అవినీతి చేసి పదేళ్లుగా బెయిల్ పై తిరుగుతున్నాడు
- బాబాయ్‌ని చంపారని చెల్లి చెబితే న్యాయం చేయలేదు
- ఇలాంటి దుర్మార్గ పాలన పోవాలనే గాంధీ జయంతి రోజున దీక్షలు
- సత్యమేయ జయతే దీక్షా కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత



రాప్తాడు (చైతన్యరథం): మహాత్ముడు జన్మించిన రోజున దేశమంతా పండుగ చేసుకుంటుంటే.. ఏపీలో మాత్రం దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా దీక్షలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్ నగర్ లో పార్టీ అధిష్టానం పిలుపుమేరకు ఆమె సత్యమేవ జయతే దీక్ష చేపట్టారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు సీపీఐ, జనసేనతో పాటు ప్రముఖ న్యాయవాదులు గురుప్రసాద్, విజయ్ కుమార్ ల బృందం, డిస్మిస్ కు గురైన ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్, వివిధ కులసంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. తాను ప్రభుత్వాన్ని ప్రశ్నించానన్న కారణంతోనే డిస్మిస్ చేశారని.. చట్టంలో ఎలాంటి తప్పిదాలు జరుగుతున్నాయన్నది ఆయన వివరించారు. మరోవైపు లాయర్ గురుప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ నాయకులపై ఎలాంటి అక్రమ కేసులు నమోదైనా .. ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా వాదిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పరిటాల సునీత మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనకు వ్యతిరేకంగా అన్ని వర్గాల వారు తమకు మద్దతు తెలుపుతున్నారన్నారు. గాంధీ జయంతి రోజును దేశమంతా ఘనంగా జరుపుకుంటోందని...కానీ మన రాష్ట్రంలో మాత్రం న్యాయం కోసం రోడ్డెక్కి దీక్షలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. లక్ష కోట్లు అవినీతి చేసి.. 16నెలలు జైల్లో ఉండి.. 10ఏళ్లుగా బెయిల్ పై తిరుగుతున్న వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. అదే రాష్ట్రంలో 45ఏళ్లు తన జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి జైల్లో ఉన్నాడన్నారు. న్యాయం జైల్లో ఉంటే.. అన్యాయం రాజ్యమేలడం అనేది ఇదేనన్నారు. రాష్ట్రానికి ఏదో చేశానని చెప్పుకుంటున్న జగన్ రెడ్డి.. తన సొంత చెల్లికి న్యాయం చేయలేదన్నారు. సొంత బాబాయిని చంపితే.. చెల్లికి న్యాయం చేయకుండా ఇంకొకరికి కొమ్ముకాశాడన్నారు. రాష్ట్రంలో పోలీసులు ఇలాంటి వారిని అరెస్టులు చేయరు కానీ.. నీతిగా బ్రతికిన చంద్రబాబును, దానిపై పోరాటాలు చేసే మా లాంటి వారిని అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు చెప్పినట్టు నడుచుకుంటున్న కొందరు పోలీసులు రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. చంద్రబాబు అరెస్ట్ తో ఎవరూ భయపడద్దని.. ఆయన త్వరలోనే నిజాయితీ నిరూపించుకుని బయటకు వస్తారన్నారు. న్యాయం ఇప్పుడు జరగకపోవచ్చు కానీ.. ఏదో ఒక రోజు న్యాయం గెలిచి తీరుతుందని.. అది గాంధీజీ నమ్మిన సిద్ధాంతమని సునీత అన్నారు.

## ధర్మ పోరాటంలో న్యాయమే గెలుస్తుంది

### సత్యమేవ జయతే నిరాహార దీక్ష చేపట్టిన మొహమ్మద్ నసీర్ అహ్మద్



గుంటూరు (చైతన్యరథం): సత్యానికి, అసత్యానికి జరుగుతున్న పోరాటంలో చివరకు న్యాయమే గెలుస్తుందని, వైసీపీ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసి ఎటువంటి మచ్చలేని చంద్రబాబును అరెస్టు చేసి జైల్లో పెట్టినా అక్రమ కేసుల నుంచి కడిగిన ముత్యంలా చంద్రబాబుకు బయటకు వస్తారని గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ గుంటూరు బస్టాండ్ వద్ద నిర్వహించిన సత్యమేవ జయతే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ... అనాడు స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా దేశం కోసం జైలుకి వెళ్లిన మహాత్మా గాంధీ... చేయని తప్పుకి జైలుకి వెళ్లిన చంద్రబాబు... ధర్మపోరాటం సాగిస్తున్నారని, నాటి బ్రిటీష్ పరిపాలనను సీఎం జగన్ రెడ్డి అనుసరిస్తున్నారని అన్నారు. నాడు సత్యం, అహింస మార్గాలను అనుసరించి నాడు మహాత్మా గాంధీ శాంతియుతంగా దీక్ష చేపట్టి బ్రిటీష్ వారిని దేశం నుండి తరిమికొట్టారని, నేడు జగన్ రెడ్డి పాలన నుండి రాష్ట్రాన్ని విముక్తి చేయాలనే లక్ష్యంతో ఆ మహాత్ముడి అడుగుజాడల్లో నడుస్తూ జైల్లో సైతం నిరాహార దీక్ష చేపట్టం జరిగిందన్నారు. ఈ దీక్షకు తాము సంఘీభావం దీక్షలు చేపట్టడం జరిగిందని, జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలో వ్యవస్థలు సర్వనాశనమైయ్యాయని, రాజారెడ్డి రాజ్యాంగం తప్ప అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదన్నారు. ఎన్ని అటంకాలు ఎదురైనా చివరకు సత్యమే గెలుస్తుందని నసీర్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు దాసరి రాజా మాస్టర్, చిట్టబత్తిన చిట్టిబాబు, నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ నియంతృత్వాన్ని కృష్ణలో కలుపుతామంటూ వర్ల కుమార్ రాజా జలదీక్ష

### చంద్రబాబుపై కక్షతోనే అరెస్టు - స్కిల్ ప్రాజెక్టులో రూపాయి అవినీతి నిరూపించలేదు



పామర్రు (చైతన్యరథం): స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో రూపాయి కూడా అవినీతి జరిగినట్లు నిరూపించలేదు. రాష్ట్రంలో ఏర్పాటైన ప్రాజెక్టుల్ని పరిశీలించనివ్వరు. అయినా ఏదో జరిగిపోయింది అంటూ చిలువలు పలువలు చేస్తూ ఆరోపణలతో కాలం నెట్టుకురావడం జగన్ రెడ్డికే చెల్లిందని పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలం దేవరపల్లి గ్రామ పరిధిలో ఉన్న కృష్ణా నదిలో దిగి జలదీక్ష చేపట్టారు. దాదాపు 30 సంవత్సరాలుగా చంద్రబాబుపై ఆరోపణలు చేయడం తప్ప ఎక్కడా ఎప్పుడూ రూపాయి అవినీతి చేశారని నిరూపించలేకపోయారు. ఇప్పుడు కూడా చంద్రబాబు అవినీతి చేశారంటూ గత నాలుగున్నర సంవత్సరాలుగా ఆరోపణలు చేస్తున్న జగన్ రెడ్డి అధికారంలో ఉండి కూడా రూపాయి అవినీతిని నిరూపించలేకపోయారు. నీతిగా బతికే వారిపై నిందలేయడం తప్ప జగన్ రెడ్డికి చేతనైంది ఏమీ లేదని తాజా ఘటనతో బయటపడింది. కుళ్లు, కుట్రలు, కుతంత్రాలతో అరెస్టు చేసి పైశాచిక ఆనందం పొందుతున్న జగన్ రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. త్వరలోనే యువగళం పాదయాత్ర ప్రారంభం కాబోతోంది. యువగళంతో జగన్ రెడ్డి అరాచక పాలనను అంతం చేయడం తథ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరాం ప్రసాద్, రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, పార్లమెంట్ నాయకులు భీమవరపు అంజి రెడ్డి, గిరిబాబు, గరికపర్రు ఎంపీటీసీ నర్రా అప్పారావు, గరికపర్రు గ్రామ సర్పంచ్ వరహాలరావు, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు వీరంకి పరుశురాం, నియోజకవర్గం తెలుగు మహిళ లాజరస్, మండల తెలుగు యువత అధ్యక్షులు వంశీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటడిగే అర్హత కోల్పోయిన జగన్

- ఫైవ్ స్టార్ హొటల్లోకే మద్యం పరిమితం చేస్తాననే మాట తప్పారు
- టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మీర్జా మా జేద్ రాజా ఆగ్రహం



2019 ఎన్నికల్లో గెలవడం కోసం ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి అనేక మోసపూరిత వాగ్దా నాలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని తుంగ లోకి తొక్కి అనునిత్యం ప్రజల్ని మోసం చేస్తున్నా రని రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మీర్జా మా జేద్ రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫైవ్ స్టార్ హొటల్లకే మద్యం పరిమితం చేస్తాననే మాట జగన్ తప్పారని... ఓటడిగే అర్హత కోల్పో యరని అన్నారు. మద్యాన్ని ఐదు నక్షత్రాల హొట ళ్లకు పరిమితం చేశాకే ఓట్లడుగుతానని గతంలో తాను చెప్పిన మాటలకు ముఖ్యమంత్రి జగన్మోహ న్‌రెడ్డి కట్టుబడితే 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజల్ని ఓట్లు అడగకూడదని, ఆ అర్హత ఆయన కోల్పోయారని అన్నారు. 2024 ఎన్నికల నాటికి మద్యాన్ని ఐదు నక్షత్రాల హొటళ్లకు పరిమితం చేయట్లేదు సరికాదా... ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అత్యంత ప్రధానమైన హామీలో ఒకటైన దశలవారీగా మద్యనిషేధం హామీకి మంగళం పాడేశారని... శుక్రవారం విడుదల చేసిన నూతన మద్య విధానమే అందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న 2934 మద్యం దుకాణాల సంఖ్యను ఒక్కటీ తగ్గించకుండా 2024 సెప్టెంబరు 30 వరకూ యథాతథంగా కొనసాగించినునట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు 2023-24సంవత్సరానికి సంబంధించి కొత్త మద్యం విధానాన్ని శుక్రవారం ఖరారు చేసింది. ఆదివారం అక్టోబర్ 1 నుంచి ఏడాది పాటు ఈ విధానం అమలు ఉండనుందని ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ్ ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం పదవీకాలం 2024 మే వరకే ఉంది. కానీ తాజాగా ప్రకటించిన మద్యం విధానం కాల పరిమితి 2024 సెప్టెంబర్ నెలఖరు వరకూ ఉంది. అంటే ఈ ప్రభుత్వం హయాం ముగిసే నాటికి రాష్ట్రంలోని మద్యం దుకాణాల న్నింటినీ ఆపేసి...5 నక్షత్రాల హొటళ్లకు మద్యం పరిమితం చేయట్లేదనే విషయాన్ని జగన్ ప్రభు త్వం తేల్చేసింది. అంటే మద్యాని షేధం హామీకి జగన్ మోహన్ రెడ్డి నీళ్లు నీళ్లొదిలేసినటేనని తేటతెల్లమైపోయింది. ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్ గా ఉన్నటువంటి మన రాష్ట్రాన్ని అనారోగ్య ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు.

## చంద్రబాబుకు మద్దతుగా దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు

### నెల్లూరులోని పరమేశ్వరి ఆలయంలో ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రార్థనలు



**నెల్లూరు (చైతన్యరథం):** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నుంచి క్షేమంగా బయటకు రావాలని కోరుతూ నెల్లూరు జిల్లా పరమేశ్వరి నగర్‌లోని ఆలయంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీబీఎన్ పేరుతో దీపాలు వెలిగించి నాగదేవతను వేడుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ... 14 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఏపీకి, విభజిత ఆంధ్రప్రదేశ్ కు విశేషమైన సేవలందించిన నేతపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడం దుర్మార్గమని ధర్మవరం సుబ్బారావు వ్యాఖ్యానించారు. తాను జైలుకు వెళ్లాడు కాబట్టి అందరిని కూడా జైల్లో ఉంచాలని జగన్ భావిస్తున్నాడని, ఎటువంటి మచ్చలేని రాజకీయ జీవితాన్ని గడిపిన వ్యక్తిపై తప్పుడు కేసులు పెట్టి పైశాచిక ఆనందం పొంతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా మారాయని.. ఒక నియంతపై మనం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బాబుకు అండగా ఉందాం... భవిష్యత్తును బాగుచేసుకుందామనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరా రు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ధర్మవరం సుజతారావు, డాక్టర్ గణేష్‌కుమార్, కల్వకుంటబాస్కర్, పద్మాబాయి, అద్దంకి చంద్ర, మదనం బేటి మునిశేఖర్, మన్నార్ స్వామి, వీరమల్లు చంద్ర, సుదా, కంచి క్రిష్ణ, సాయిక్రిష్ణ, చిన్నబ్బాయి యాదవ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యమేవ జయతే... నినదించిన శ్రేణులు






పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో సత్యమేవ జయతే అంటూ నిరాహార దీక్ష చేపడుతున్న ప్రజలు



చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ గుంటూరులో నిర్వహించిన కాగడాల ప్రదర్శనను అడ్డుకుంటున్న పోలీసులు



చంద్రబాబుకు మద్దతుగా కడపలో సత్యమేవ జయతే దీక్షలో భాగంగా నోటికి నల్లరిబ్బన్ కట్టుకుని నిరసన



విజయవాడలో ఎమ్.ఎస్ బేగ్ ఆధ్వర్యంలో సత్యమేవ జయతే నిరాహార దీక్ష చేపడుతున్న కార్యకర్తలు



పొన్నూరులో సత్యమేవ జయతే నిరాహార దీక్షలో భాగంగా నిరసన వ్యక్తం చేస్తున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



సత్యమేవ జయతే నిరాహార దీక్షలో పాల్గొన్న మాజీమంత్రి నెట్టెం రఘురామ్ తదితరులు



గుంటూరులో నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో వినూత్న రీతిలో సత్యమేవ జయతే నిరాహార దీక్ష



చంద్రబాబుకు మద్దతుగా రక్తంతో సంతకం చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు



గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సత్యమేవ జయతే నిరాహార దీక్షలో పాల్గొన్న మొహ్మద్ నసీర్



విజయవాడలోని టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మునికి వినతిపత్రం అందజేస్తున్న అధ్యక్షుడు రఘురామరాజు



చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా దీక్ష చేపట్టిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య కుటుంబ సభ్యులు



యర్రగొండపాలెంలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపట్టిన గూడూరి ఎరిక్షన్ బాబు



జగ్గయ్యపేటలో శ్రీరామ్ తాతయ్యకు నిమ్మరసం ఇచ్చి దీక్షవిరమింపజేస్తున్న నెట్టెం రఘురామ్



మైలవరంలో నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ లీగల్ సెల్ సభ్యుడు గూడపాటి లక్ష్మీనారాయణ



గన్ని కృష్ణ ఆధ్వర్యంలో జాతిపితకు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు మహిళలు

# సత్యమేవ జయతే... నినదించిన శ్రేణులు





గుంటూరులో 36 గంటల పాటు జరిగిన ధర్మాగ్రహ దీక్ష ముగింపు సందర్భంగా క్యాండిల్ నిరసన ప్రదర్శన



కందుకూరులో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు



మైలవరం నియోజకవర్గం గొల్లపూడిలో నిరసన తెలుపుతున్న వారికి సంఘీభావం తెలుపుతున్న దారునాయక్



పామర్రులో నిరాహార దీక్ష చేపట్టిన మహిళలకు సంఘీభావం తెలియజేస్తున్న వర్లరామయ్య



నెల్లూరు జిల్లా కోవూరులో క్యాండిల్ తో నిరసన తెలుపుతున్న చేజర్ల వెంకటేశ్వరరెడ్డి



విజయవాడ 42వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన



కర్నూలులో మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సోమిశెట్టి తదితరులు



నెల్లూరు సత్యమేవ జయతే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న అజీజ్ తదితరులు



మాడుగులలో నిరాహార దీక్షకు ముందు నిరసన ర్యాలీ చేపడుతున్న కార్యకర్తలు



ఉదయగిరిలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపట్టిన మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు



ఉంగుటూరులో జాతిపితకు నివాళులరిస్తున్న టీడీపీ నేతలు మాగంటి బాబు, బడేటి చంటి



నారా భువనేశ్వరికి మద్దతుగా ద్వారకా తిరుమలకు బయలుదేరిన తెలుగు మహిళలు



ఆలూరులో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న కోట్ల సుజాతమ్మ



నారా భువనేశ్వరికి మద్దతుగా కొత్తపేట నియోజకవర్గంలో తెలుగుమహిళల నిరాహారదీక్ష



పార్వతీపురం మన్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

# సత్యమేవ జయతే... నినదించిన శ్రేణులు





పీలేరులో అధినేత చంద్రబాబుకు మద్దతుగా నిరసన తెలుపుతున్న కార్యకర్తలు



మర్కాపురంలో అరగుండుతో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు



కనిగిరిలో ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో అధినేతకు మద్దతుగా నిరాహార దీక్ష



పెడనలో నిరాహార దీక్ష చేపడుతున్న కాగిత కృష్ణ ప్రసాద్ తదితరులు



పెనుకొండలో బి.కె పార్థసారథి ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



డోన్‌లో మన్నే సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శ్రేణుల నిరాహార దీక్ష



కమలాపురంలో జాతిపితకు నివాళులర్పిస్తున్న పుత్తా నరసింహారెడ్డి, కార్యకర్తలు



రాజోలులో మాజీమంత్రి గొల్లపల్లి ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు ముందు నిరసన ర్యాలీ



పెనమలూరులో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న బోడే ప్రసాద్



అధినేత అరెస్టును వ్యతిరేకిస్తూ నరసరావుపేటలో మోకాళ్లపై నడిచి జాతిపితకు వినతిపత్రం అందజేస్తున్న మందాడి రావి



ఆదోనిలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న మీనాక్షీనాయుడు



సంతనూతలపాడులో మహాత్మకు నివాళులర్పిస్తున్న బి.ఎన్ విజయ్ కుమార్



విశాఖలో గండి బాబ్జి ఆధ్వర్యంలో శ్రేణుల నిరాహార దీక్ష



విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని గన్నె ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రేణుల నిరాహార దీక్ష



చంద్రగిరిలో శ్రేణులతో కలిసి రిలే నిరాహా దీక్ష చేపట్టిన పులివర్తి నాని

# సత్యమేవ జయతే... నినదించిన శ్రేణులు




పలమనేరులో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి


నగిరిలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్షలో కూర్చున్న గాలి భానుప్రకాష్


కుప్పంలో చంద్రబాబుకు మద్దతుగా నిరాహార దీక్ష చేపడుతున్న కార్యకర్తలు


జీడీ నెల్లూరులో నిరాహార దీక్ష చేపడుతున్న కార్యకర్తలు


చంద్రబాబును విడుదల చేయాలని చిత్తూరులో డిమాండ్ చేస్తున్న కార్యకర్తలు


మంగళగిరిలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న పార్టీ ముఖ్య నేతలు


చంద్రబాబుకు మద్దతుగా తెనాలిలో నిరాహార దీక్ష చేపట్టిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ దపంతులు


రంపచోడవరంలో నిరాహార దీక్ష చేపడుతున్న వంతల రాజేశ్వరీ, కార్యకర్తలు


నూజివీడులో నిరాహార దీక్ష చేపట్టిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తదితరులు


జంగారెడ్డిగూడెంలో చంద్రబాబుకు మద్దతుగా ఆందోళన వ్యక్తం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు


విజయవాడలో చంద్రబాబుకు మద్దతుగా నిరాహార దీక్ష చేపడుతున్న గద్దె రామ్మోహన్ దంపతులు


విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న బొండా ఉమామహేశ్వరరావు


రాజానగరంలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న బొడ్డు వెంకటరమణ చౌదరి


చింతపూడిలో ఆందోళన చేపడుతున్న కార్యకర్తలు


మడకశిరలో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న గుండుమల తిప్పేస్వామి

# సత్యమేవ జయతే... నినదించిన శ్రేణులు





రామగిరి మండలం, ఎమ్.సి పల్లి గ్రామంలో టీడీపీ కార్యకర్తల నిరాహార దీక్ష



మాజీమంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడుతున్న కార్యకర్తలు



నంద్యాల జిల్లా, డోన్ నియోజకవర్గం ప్యాపిలీలోని చెన్నకేశవస్వామీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చిత్రం



శ్రీశైలంలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు



సత్తెనపల్లిలో శ్రేణులు చేపట్టిన నిరాహార దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కన్నా లక్ష్మీనారాయణ



వినుకొండ పట్టణంలో చంద్రబాబుకు మద్దతుగా నిరాహార దీక్ష చేపడుతున్న కార్యకర్తలు



మదనపల్లిలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న శ్రేణులు



విశాఖలో శ్రేణులతో కలిసి మహాత్మకు నివాళులర్పిస్తున్న శ్రీభరత్



నంద్యాలలో మహాత్మకు వినతి పత్రం అందజేస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి




గిద్దలూరులో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న ముత్తముల అశోక్ రెడ్డి



పొదిలిలో చంద్రబాబుకు మద్దతుగా నిరాహార దీక్ష చేపట్టిన పార్టీ కార్యకర్తలు



గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో శ్రేణులతో కలిసి నిరాహార దీక్ష చేపడుతున్న మాజీ మంత్రి మాకినేని రత్తయ్య



యాడికిలో చంద్రబాబుకు మద్దతుగా నిరాహార దీక్ష చేపడుతున్న తెలుగు మహిళలు



రోడ్లు ఊడ్చి నిరసన తెలుపుతున్న ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జ్ బూర్ల రామంజనేయులు



తునిలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

# సత్యమేవ జయతే... నినదించిన శ్రేణులు

చైతన్యరథం


తునిలో ఆందోళన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు


ఉరవకొండలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు



పెదకూరపాడులో సత్యమేవ జయతే దీక్ష చేపట్టిన కొమ్మలపాటి శ్రీధర్ తదితరులు


గుంతకల్లులో కొవ్వొత్తులతో చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్న కార్యకర్తలు


అనంతపురం అర్బన్ లో మాజీ మేయర్ సర్పంచ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన


మాదినేని ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పూజలు


అనంతపురంలో చంద్రదండు ఆధ్వర్యంలో నిరసన


చంద్రబాబుకు మద్దతుగా కొవ్వొత్తుల నిరసన


నాయుడుపేటలో చంద్రబాబుకు మద్దతుగా సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తున్న కార్యకర్తలు


తిరుపతిలో చంద్రబాబుకు మద్దతు తెలుపుతున్న కార్యకర్తలు


వెంకటగిరిలో మహాత్మకు నివాళులర్పిస్తున్న కార్యకర్తలు


దొనకొండలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు


పాణ్యంలో శ్రేణులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ పాల్గొన్న గౌరు చరిత రెడ్డి


కళ్యాణదుర్గంలో చంద్రబాబుకు మద్దతుగా కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న కార్యకర్తలు



గుంటుపల్లిలో కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు



## గాంధీకి నివాళులర్పించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీకి ప్రధానమంత్రి నరేంద్రమోడీ నివాళులర్పించారు. ఉదయం 7.30 గంటలకు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌కు చేరుకొని గాంధీ సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. సోమవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్మాగాంధీకి తాను ప్రణామిల్లుతున్నానని, ఆయన కాలతీతమైన ఆయన బోధనలు మనకు మార్గాన్ని చూపించడంలో ఎప్పుడూ ముందుంటాయని, గాంధీ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఉందని అన్నారు. ప్రజల మధ్య ఐక్యతను, సామరస్యాన్ని పెంపొందించడంలో ఆయన బోధనలు ఎప్పుడూ ప్రపంచ మానవాళిని ఉత్తేజపరుస్తూనే ఉంటాయని అన్నారు. గాంధీజీ కన్న కలలను సాకారం చేయడానికి మనందరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోడీ తోపాటు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సెనా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తదితరులు రాజ్‌ఘాట్‌లో మహాత్మాగాంధీకి ఆయన జయంతి సందర్భంగా నివాళులర్పించారు.

దేశంలోనే మొదటిసారి

# బీహార్ కుల గణన నివేదిక విడుదల

**27 శాతం మంది వెనకబడిన తరగతులు - 36 శాతం మంది అత్యంత వెనకబడిన తరగతులు**

పాట్నా: గాంధీ జయంతి రోజున బీహార్ ప్రభుత్వం చారిత్రాత్మక ఘట్టానికి తెరలేపింది. దేశంలోనే మొదటి రాష్ట్రంగా కుల గణన నివేదికను విడుదల చేసింది. రాష్ట్ర జనాభా మొత్తం 10 కోట్ల 10 లక్షల మంది దాకా ఉండగా అందులో బీసీలు 63 శాతం మందిగా ఉన్నారు. వీరిలోనూ సాధారణ వెనుకబడిన తరగతుల ప్రజలు 27 శాతం మంది ఉండగా అత్యంత వెనుకబడిన తరగతుల ప్రజలు 36 శాతం మందిగా ఉన్నారు. ఇక ఎస్సీలు 19.7 శాతం మంది ఉండగా, ఎస్టీలు 1.7 శాతం మంది ఉన్నారు. ఇతర కులాలు 15.5 శాతంగా ఉన్నారు. 63 శాతంగా ఉన్న మొత్తం ఓబిసిల్లో ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌కు చెందిన యాదవ్ కులస్తులు 14.27 శాతంగా ఉన్నారు. ఇప్పటి వరకు బీసీలు రిజర్వేషన్లలో 27 శాతం మాత్రమే ఉండగా ఈ నివేదిక విడుదల నేపథ్యంలో తమ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వాలనే డిమాండ్లు ముందుకు వచ్చే అవకాశం ఉంది. గాంధీ జయంతి రోజున కులగణన నివేదికను విడుదల చేయడంపై బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కులగణన నివేదికపై త్వరలోనే బీహార్ అసెంబ్లీలో ఉన్న తొమ్మిది పార్టీలతో మీటింగ్ పెడతామని, అందరికీ నివేదిక వివరాలు వెల్లడిస్తామని నితీష్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ ఈ నివేదిక దశాబ్దాల పోరాట ఫలితమని అన్నారు. ఇక నుండి ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వ విధానాలు నిర్ణయమౌతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ స్పందిస్తూ బిజెపి ఎన్ని కుట్రలు చేసినప్పటికీ న్యాయ పరంగా అడ్డంకులు వచ్చినప్పటికీ చివరకు కుల గణన నివేదిక బయటకు రావడం సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. అయితే బిజెపి స్పందన మాత్రం మిశ్రమంగా ఉంది. బీహార్‌కే చెందిన కేంద్ర మంత్రి గిరిరాజ్‌సింగ్ మాట్లాడుతూ నివేదికను కంటితుడుపు చర్యగా భావిస్తున్నట్లు చెప్పారు. బీహార్ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సమ్రాట్ చౌదరి మాట్లాడుతూ కులగణన నివేదిక తయారీకి తమ పార్టీ పూర్తి మద్దతు నిచ్చిందని తెలిపారు. అయితే నివేదికను రూపొందించడానికి అనుసరించిన విధానమేంటనేది పూర్తిగా పరిశీలించిన తర్వాత అధికారికంగా స్పందిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీహార్ ప్రభుత్వం కులగణన నివేదికను స్వాగతించింది. అట్టడుగు వర్గాల వారికి సామాజిక న్యాయం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయిలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేసింది. రాహుల్ గాంధీ స్పందిస్తూ మొత్తం జనాభాలో బీసీ,ఎస్సి, ఎస్టీలే 86 శాతంగా ఉన్నారని బీహార్ కుల గణంకాలు తెలుపుతున్నాయని, వారి జనాభాకు అనుగుణంగా అన్నింటిలోనూ వారి వాటా వారికి కేటాయించాలని అన్నారు. కాగా బీహార్ కులగణన నివేదిక తయారీపై సుప్రీంకోర్టులో కేసు నడుస్తోంది. గతంలో పాట్నా హైకోర్టు నివేదిక తయారీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తీర్పుపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. గత ఏడాది జూన్‌లో బీహార్ ప్రభుత్వం కుల గణన నివేదిక తయారీని మొదలు పెట్టింది.



# ఎలక్ట్రిక్ కారులో మంటలు



బెంగళూర్‌లో తాజాగా నడిరోడ్డుపై ఓ ఎలక్ట్రిక్ కారు అగ్నికి ఆహుతైంది. కారు పూర్తిగా కాలిపోయింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సెప్టెంబర్ 30న బెంగళూర్‌లోని జేపీనగర్ లో ఈ ఘటన జరిగింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగ లేదు. కారు కాలిపోతున్న సమయంలో జనాలు దూరంగా ఉన్నారు. అటు వైపుగా వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. అయితే అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఇంకా తెలియరాలేదు. . సడెన్ గా కారు నుంచి పేలుడు కూడా సంభవించింది. గతంలో ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాలను తనిఖీ చేయడానికి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. అనేక ఈవీ కంపెనీలు తమ తమ ద్విచక్ర వాహనాలను రీకాల్ చేశాయి. అయితే ఇప్పుడు కార్ల విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# సత్ఫలితాలనిస్తున్న ఖేలో ఇండియా

**- కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్**



న్యూఢిల్లీ: ఖేలో ఇండియా ఆటల ద్వారా ముందుకు వస్తున్న అనేక మంది క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌లలో పతకాలు సాధిస్తున్నందున ఆశించిన ఫలితాలను తీసుకువస్తున్నట్లు కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ తెలిపారు. ఆసియా క్రీడల్లో షూటింగ్, సెయిలింగ్, టెన్నిస్ మరియు వుషులలో పతకాలు సాధించిన 24 మందిని మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఠాకూర్ మాట్లాడుతూ.. ఆసియా క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులను అభినందించారు. అలాగే కోచ్‌లు, సహాయక సిబ్బందికి అభినందనలు తెలిపారు. పతక విజేతలు దేశానికి ఎంతో గర్వకారణంగా నిలిచారని, వారి కృషి దేశాన్ని క్రీడా రంగంలో అగ్రగామిగా నిలబెట్టాయని అన్నారు.

## మోస్ట్ వాంటెండ్ ఐసిస్ ఉగ్రవాది అరెస్ట్

న్యూఢిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ) మోస్ట్ వాంటెండ్ ఐసిస్ ఉగ్రవాది మహ్మద్ షానవాజ్ అలియాస్ షఫీ ఉజమాను ఢిల్లీలో అరెస్ట్ చేసింది. ఇతని సమాచారం అందించిన వారికి మూడు లక్షల రూపాయల రివార్డును ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. షానవాజ్ ఢిల్లీలో ఉగ్రవాద కార్యకలాపాలకు కుట్ర చేసినట్లు అధికారులు చెబుతున్నారు. తమ వద్ద బందీగా ఉన్న ఓ ఉగ్రవాది ఇచ్చిన సమాచారం ఆధారంగా షానవాజ్‌ను బంధించారు. వృత్తిరీత్యా ఇంజనీర్ అయిన షానవాజ్ పూణే ఐసిఎస్ మాడ్యూల్ కేసులో నిందితుడు. ఇతను పుణే పోలీస్ కస్టడీ నుండి తప్పించుకొని వచ్చి ఢిల్లీలో ఉంటున్నాడు. ఐసిఎస్ ఉగ్రవాదులుగా అనుమానిస్తున్న మరో ఇద్దరితో కలిపి ఇతన్ని విచారిస్తున్నారు. షానవాజ్ దగ్గరి నుండి ఐఈడీలను తయారు చేయడానికి ఉపయోగించే పలు రసాయనాలను స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు, ఎన్ఐఏ అధికారులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

## అసోం, మేఘాలయలో భూకంపం..

**- రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 5.3గా నమోదు**



ఈశాన్య రాష్ట్రాలు, అసోం, మేఘాలయల్లో సోమవారం భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై భూకంప తీవ్రత 5.3గా నమోదైంది. జాతీయ భూకంప పరిశోధనా కేంద్రం కథనం ప్రకారం సోమవారం సాయంత్రం 6.15 గంటలకు భూమి కంపించింది. మేఘాలయలోని నార్త్ గ్యారో హిల్స్ వద్ద భూకంప కేంద్రం కేంద్రీకృతమై ఉందని తెలిపింది. అసోం, మేఘాలయలతోపాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, చైనాల్లోనూ భూమి కంపించినట్లు వార్తలు వచ్చాయి. భూకంపం వల్ల ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్లు వార్తలు రాలేదు. ఇంకా పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## యువకుడి కడుపులో గర్భాశయం



చత్తీస్‌ఘర్: ఓ యువకుడి కడుపులో గర్భాశయం ఉంది. వినడానికే ఆశ్చర్యంగా అనిపించినా ఇది నిజం. చత్తీస్‌ఘర్‌లోని ధమ్‌తరీ జిల్లాలో 27 ఏళ్ల యువకుడు కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. వైద్యం కోసం హాస్పటిల్‌కు వెళ్లాడు. అతని కడుపును పరీక్ష చేసిన వైద్యులు కంగుతిన్నారు. అతని కడుపులో అభివృద్ధి చెందని గర్భాశయం ఉంది. వెంటనే ఆపరేషన్ చేసి దాన్ని తీసేశారు. ఇప్పుడు అతని పరిస్థితి నిలకడగా ఉంది. కానీ ఇంకా చికిత్స అవసరమని వైద్యులు చెప్పారు. చాలా అరుదుగా ఇలా జరుగుతుందని, ఇలాంటి వారు ప్రపంచంలో ఓ 300 మంది ఉంటారని చెప్పారు. ఇంకాస్త ఆలస్యమయి ఉంటే అది క్యాన్సర్‌గా మారేదని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణంగా పుట్టుకతోనే వీటిని గుర్తిస్తామని, ఆరేళ్ల వయస్సులోనే ఆపరేషన్ చేసి తొలగిస్తామని వైద్యులు తెలిపారు.

## వందేభారత్‌కు తప్పిన పెను ప్రమాదం..



ఉదయ్‌పూర్-జైపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయ్‌పూర్ నుంచి బయలుదేరింది. అయితే.. కొంత దూరం ప్రయాణించిన తర్వాత భిల్వారా సమీపంలో రైల్వే ట్రాక్‌పై వరుసగా రాళ్లు, ఇనుప రాడ్లు పేర్చి ఉండటాన్ని గమనించారు. దీంతో.. వెంటనే రైలు ఆపి, రైల్వే ఉద్యోగులు వాటిని తొలగించడానికి కిందకు దిగారు. రాళ్లు తొలగిస్తున్న క్రమంలో.. మరో షాకింగ్ విషయాన్ని వాళ్లు గుర్తించారు.

రైలు ఆగిన చోటు నుంచి 10-15 అడుగుల దూరంలో పెద్ద రాళ్లను వరుసగా పేర్చారు. అంతేకాదు.. పట్టాలను కలిపే లింక్ వద్ద రెండు ఇనుప రాడ్లను కూడా ఇరికించారు. ఆ పెద్ద రాళ్లు కింద పడకుండా ఉండేందుకు.. అటు, ఇటు రెండు రాడ్లు అమర్చారు. ఒకవేళ ఇది గుర్తించకుండా రైలు వేగంగా వెళ్లి ఉంటే, బహుశా పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. 'డీ-రెయిల్' (పట్టాలు తప్పడం) అయ్యే అవకాశం లేకపోలేదని నిపుణులు చెప్తున్నారు. దీన్ని బట్టి చూస్తే.. ఎవరో కావాలనే ప్రమాదం జరగా లన్న ఉద్దేశంతో ఈ రాళ్లను పక్కా ప్లానింగ్‌తో పేర్చి ఉంటారని తెలుస్తోంది. రైల్వే అధికారులు ఈ మొత్తం తతంగాన్ని తమ ఫోన్‌లో రికార్డ్ చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. దీంతో.. ఆ రాళ్లు, ఇనుప రాడ్లు ఎవరు పేర్చారన్న అంశం హాట్ టాపిక్‌గా మారింది.

ఇదిలా వుండగా.. ఈ ఉదయపూర్-జైపూర్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును సెప్టెంబర్ 24వ తేదీ నుంచి ప్రారంభించారు. ఈ రైలు ఉదయపూర్, చిత్తోర్‌గఢ్, భిల్వారా, అజ్మీర్, జైపూర్‌తో సహా రాష్ట్రంలోని ఐదు జిల్లాల గుండా వెళుతుంది. తన మార్గంలో ఈ రైలు కిషన్‌గఢ్, అజ్మీర్, భిల్వారా, చందేరియా, మావ్లీ జంక్షన్, రాణా ప్రతాప్ నగర్ స్టేషన్‌లలో ఆగుతుంది. ఇది ఉదయపూర్‌లో ఉదయం 7.50 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు జైపూర్ చేరుకుంటుంది. అక్కడి నుంచి తిరిగి సాయంత్రం 4 గంటలకు జైపూర్‌లో బయలుదేరి రాత్రి 10 గంటలకు ఉదయపూర్ చేరుకుంటుంది.

## ఆగ్నేయ ఆసియాలోనే మొదటి హైస్పీడ్ రైలును ప్రారంభించిన ఇండోనేషియా






జకర్తా: చైనా నిధుల సహాయంతో నిర్మించిన ఆగ్నేయ ఆసియాలోనే మొదటి హైస్పీడ్ రైలును సోమవారం ఇండోనేషియా అధ్యక్షుడు జోకో విడోడో ప్రారంభించారు. చైనా బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్ట్ కారణంగా రెండు ప్రధాన నగరాల్యైన జకర్తా, బండిరగ్‌ల మధ్య ప్రయాణ సమయం తగ్గనుంది. ఇండోనేషియా ప్రభుత్వ సంస్థలు, చైనా రైల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కలిసి ఏర్పాటు చేసిన పిటి కెరాటా సెపెట్ ఇండోనేషియా చైనా అనే సంయుక్త సంస్థ ఆధ్వర్యంలో 7.3 బిలియన్ డాలర్ల ఖర్చుతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ప్రాజెక్ట్ చాలా కాలం సమయం తీసుకోవడంతో నిర్మాణ ఖర్చులు పెరిగిపోయాయి. కమర్షియల్‌గా సక్సెస్ అవుతుందా అనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఇండోనేషియా రాజధాని జకర్తా, వెస్ట్ జావా ప్రావిన్స్ బండిరగ్ మధ్య గంటకు 350 కిలో మీటర్ల వేగంతో ప్రయాణించే ఈ హైస్పీడ్ రైలు ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని మూడు గంటల నుండి 40 నిమిషాలకు తగ్గించనుంది. తమ దేశంలో ప్రజా రవాణాను ఆధునీకరించడంలో ఈ హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని విడోడో అన్నారు.

## పాకిస్తాన్ ఆత్మాహుతి దాడిలో మృతుల సంఖ్య 59కి పెరిగింది

పాకిస్తాన్ బలూచిస్తాన్‌లోని మస్తుంగ్ జిల్లాలో జరిగిన ఆత్మాహుతి పేలుడులో గాయపడిన మరో ఏడుగురు మరణించారు, మృతుల సంఖ్య 59కి చేరుకుంది. క్వెట్టా సివిల్ హాస్పిటల్ ప్రతినిధిని ఉటంకిస్తూ స్థానిక జియో న్యూస్ శనివారం ఈ సమాచారాన్ని అందించింది. నవాబ్ గౌస్ బక్ష్ మెమోరియల్ ఆసుపత్రిలో 52 మంది, సివిల్ ఆసుపత్రిలో ఆరుగురు, బిఎంసీ కాంప్లెక్స్‌లో ఒకరు మరణించారని అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈద్ మిలాదున్ నబీకి సంబంధించిన ఊరేగింపు కోసం సిద్ధమవుతున్న ప్రజలను లక్ష్యంగా చేసుకుని శుక్రవారం ఒక మసీదు సమీపంలోని మసీదుపై ఆత్మాహుతి బాంబర్ దాడి చేశాడు.

## పాకిస్తాన్ విమానయాన సంస్థలు దివాళా




ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న పొరుగు దేశం పాకిస్థాన్‌కు సమస్యలు తీరే సూచనలు కనిపించడం లేదు. నష్టాల్లో ఉన్న పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ కి చెందిన ఐదు బోయింగ్-777 విమానాలు నిలిచిపోయాయి. వాటిలో ఇంజన్ లేకపోవడంతో ఇలా జరిగింది. పాకిస్తాన్ యొక్క ఆర్య న్యూస్ నివేదిక ప్రకారం, ఐదు విమానాలలో రెండు ఇప్పుడు శాశ్వతంగా నిలిచిపోయాయి. ఇప్పుడు అది మళ్లీ ఎగరదు.

మొత్తం 12 విమానాల్లో ప్రస్తుతం ఏడు మాత్రమే పనిచేస్తున్నాయని నివేదిక పేర్కొంది. సౌదీ అరేబియాలోని ఓడరేవు నగరం జెద్దాలో మరొకటి శిథిలావస్థకు చేరుకుంది. పాకిస్తాన్ ప్రభుత్వ ఎయిర్‌లైన్స్ నిర్వహణ కోసం $60 మిలియన్లు కావాలి. విషయం యొక్క తీవ్రతను చూసిన కేర్‌టేకర్ పీఎం అన్వర్-ఉల్-హక్ కకర్, పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తన విమానయాన మంత్రిని ఆదేశించారు.

# శ్రీలంక, బంగ్లాదేశ్‌లో జాతిపితకు ఘన నివాళి





శ్రీలంకలో జాతిపిత మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. శ్రీలంక ప్రధాని దినేష్ గుణవర్ధన కొలంబోని ఆయన నివాసమైన టెంపుల్ ట్రీస్‌లో శ్రీలంకలోని భారత హైకమిషనర్ కలిసి మహాత్మా గాంధీకి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహాత్ముని ఆదర్శాలు, విలువల ప్రపంచ ఔచిత్యం గురించి గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా భారత హైకమిషన్ అధికారులు ప్రత్యేక పరిశుభ్రత డ్రైవ్‌ను కూడా నిర్వహించారు. జాఫ్నాలోని భారత కాన్సులేట్ జనరల్ గాంధీ జయంతిని జరుపుకున్నారు. జాఫ్నాలోని ఆరియాలై, కార్గిల్స్ స్క్వేర్‌లో ఉన్న జాతిపిత విగ్రహానికి కాన్సుల్ జనరల్ రాకేష్ నటరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్యాండీలోని అసిస్టెంట్ హైకమిషన్ ఆఫ్ ఇండియా కూడా గాంధీ జయంతిని పురస్కరించుకుని అసిస్టెంట్ హైకమిషనర్ డాక్టర్ అతిరా ఎస్ మరియు అధికారులు బాపుకు నివాళు లర్పించారు.

**బంగ్లాదేశ్‌లో:** మహాత్మా గాంధీ 154వ జయంతిని బంగ్లాదేశ్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. నోఖాలిలోని చారిత్రాత్మక గాంధీ ఆశ్రమం వరుస కార్యక్రమాలతో మహాత్మా గాంధీకి నివాళులర్పించింది. ఈ సందర్భంగా బంగ్లాదేశ్‌లోని భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మ ఆశ్రమాన్ని సందర్శించి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. "నోఖలీలో శాంతి, సామరస్యం కోసం గాంధీజీ అన్వేషణ, సమకాలీన ప్రపంచంలో దాని ఔచిత్యం" అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా హైకమిషనర్ మాట్లాడుతూ.. 1946లో గాంధీజీ చారిత్రాత్మకమైన నోఖాలి పర్యటనను హైలైట్ చేస్తూ, అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో కూడా సంభాషణ, సానుభూతి, అవగాహన యొక్క అసాధారణ శక్తికి గాంధీజి ఉదాహరణగా నిలిచారన్నారు. ప్రతి సంవత్సరం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా అంతర్జాతీయ అహింసా దినోత్సవాన్ని జరుపుకోవడం శాంతి, అహింస, సహనం, అవగాహన యొక్క విశ్వవ్యాప్త విలువలను పునరుద్ఘాటిస్తుందని వర్మ అన్నారు. ఆసియా, ఆఫ్రికాలో వలసవాద వ్యతిరేక పోరాటాన్ని ప్రేరేపించడంలో మహాత్మా గాంధీ యొక్క సహకారాన్ని ఆయన నొక్కిచెప్పారు. వాతావరణ మార్పులు, స్థిరమైన అభివృద్ధి వంటి మన కాలంలోని కొన్ని ముఖ్యమైన సమస్యలకు గాంధేయవాదం పరిష్కారం చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపి హెచ్ఎస్ ఇబ్రహీం, గాంధీ ఆశ్రమ ట్రస్ట్ చైర్మన్ జీవన్ కనాయి దాస్, డైరెక్టర్ అండ్ సిఇఒ రహనాబా కుమార్, గాంధీ ఆశ్రమ ట్రస్ట్ ధర్మకర్తలు, ఆహ్వానిత ప్రముఖులు పాల్గొన్నారు. జమాల్‌పూర్ గాంధీ ఆశ్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, ఇందులో చిన్నారులు కూడా పాల్గొన్నారు.

# ప్రపంచంలోనే ది బెస్ట్ విస్కీ మనదే




భారత్‌లో తయారైన ఇంద్రి విస్కీ. విస్కీస్ ఆఫ్ ది వరల్డ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఇన్ షో, డబుల్ గోల్డ్' టైటిల్‌ను గెలుచుకుంది. దీపావళి కలెక్టర్ ఎడిషన్ 2023లో ప్రపంచంలోని అతిపెద్ద విస్కీ-టేస్టింగ్ పోటీలలో ఒకటైన 'డబుల్ గోల్డ్ బెస్ట్ ఇన్ షో' అవార్డును ఇంద్రి సాధించింది. ఇందులో ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 100 రకాలకుపైగా విస్కీలు పోటీపడతాయి. విస్కీస్ ఆఫ్ ది వరల్డ్ అవార్డ్స్ కేటగిరీల వారీగా అనేక రౌండ్లలో రుచిని బట్టి ఎంపికచేస్తారు. ఆ క్రమంలో ఈ పరిశ్రమలోని కొంతమంది టాప్ టేస్ట్‌మేకర్‌లు, ఇన్‌ఫ్లుయెన్సర్‌ల ప్యానెల్ ప్రతి తరగతిలో ఒక విస్కీని అత్యుత్తమ విస్కీగా ప్రకటిస్తాయి. ఆ క్రమంలో భారతీయ సింగిల్ మాల్ట్ స్కాచ్ అయిన ఇంద్రి విస్కీ..బోర్బన్, కెనడియన్, ఆస్ట్రేలియన్, బ్రిటిష్ సింగిల్ మాల్ట్‌లతో సహా వందలాది అంతర్జాతీయ బ్రాండ్‌లను ఓడించింది.

హర్యానాలోని పిక్కడిల్లీ డిస్టిలరీస్ స్వదేశీ బ్రాండ్ అయిన ఇంద్రి తన ప్రయాణాన్ని ఇంద్రి-ట్రిని అని పిలవబడే మొదటి ట్రిపుల్-బ్యారెల్ సింగిల్ మాల్ట్‌తో 2021లో ప్రారంభించింది. గత రెండేళ్లలో ఇది 14 కంటే ఎక్కువ అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుంది. ఈ ప్రత్యేకమైన విస్కీ తయారీని ఉత్తర భారతదేశంలోని ఉపఉష్ణమండల వాతావరణంలో షెర్రీ క్యాస్‌లలో పరిపక్వత ఆధారంగా తయారు చేస్తారు. పొగ, క్యాండీడ్ డ్రైఫ్రూట్స్, కాల్చిన గింజలు, సూక్ష్మ సుగంధ ద్రవ్యాలు, ఓక్, బిటర్‌స్వీట్ చాక్లెట్ వంటి పలు రకాల పదార్థాలను ఉపయోగిస్తారు. ఇంద్రి ట్రిని ఇప్పటికే భారతదేశంలోని 19 రాష్ట్రాలు, 17 ఇతర దేశాలలో కూడా అందుబాటులో ఉంది. నవంబర్ నుంచి అమెరికా, ఎంపిక చేసిన యూరోపియన్ దేశాలకు కూడా సరఫరా చేస్తున్నారు. ఈ విజయం తమ నాణ్యత, పెరుగుతున్న ప్రజాదరణకు నిదర్శనమని ఇంద్రి విస్కీ నిర్వాహకులు అంటున్నారు.

# టర్కీలోని పార్లమెంట్ హౌస్ వద్ద ఉగ్రవాదుల దాడి..



టర్కీ రాజధాని అంకారా నడిబొడ్డున ఆత్మాహుతి దాడి జరిగింది. పార్లమెంట్ భవనం వెలుపల, మంత్రిత్వ శాఖ భవనాలకు ముందు ఇద్దరు ఉగ్రవాదులు ఆత్మహుతి బాంబు దాడికి పాల్పడ్డారని టర్కీ అంతర్గత మంత్రి ఆదివారం చెప్పారు. వేసవి విరామం తర్వాత పార్లమెంట్ తిరిగి తెరవడానికి కొన్ని గంటల ముందు ఈ దాడి జరిగింది. టర్కీ పార్లమెంట్ సమీపంలోకి కారులో వచ్చిన ఉగ్రవాది పార్లమెంట్ సమీపంలో కారులను పార్కింగ్ చేసి పార్లమెంట్ గేట్ వద్దకు వేగంగా పరిగెత్తాడు. దీంతో అక్కడ ఉన్నభద్రతా సిబ్బంది అతన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు. ఈ ప్రమాదంలో టెర్రరిస్ట్ మృతి చెందగా ఇద్దరు పోలీస్ అధికారులు స్వల్పంగా గాయపడ్డారు. ఆత్మాహుతి దాడి జరుగుతున్న సమయంలో అసలు భద్రతా సిబ్బందికి ఏం జరుగుతుందో అర్థం కాలేదు. దీంతో వారు ఎదురుగా ఎవరు ఉన్నారనేది చూడకుండా కాల్పులు జరిపారు. వారు కాల్పులు జరిపే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా దేశ రాజధాని టర్కీలో ఇంకా ఉగ్రవాదులు ఉండే అవకాశం ఉందని ఆ దేశ అధికారులు అంటున్నారు. వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

ఈ దాడి తర్వాత టర్కీ గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ, ఇతర ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోని ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీ చేస్తోంది. సిటీ సెంటర్ లోకి వెళ్లే అన్ని దారుల్ని పోలీసులు చుట్టుముట్టారు. ఈ ఆత్మాహుతి దాడికి బాధ్యత వహిస్తున్నట్లు కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ (పికెకె) ఆదివారం ప్రకటించింది. పీకేకే మిలిటెంట్ గ్రూప్‌కు సన్నిహితంగా ఉండే ఏఎన్ఎఫ్ న్యూస్, ఈ బాంబు దాడిని పార్లమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన 'ఆత్మాహుతి దాడి'గా అభివర్ణించింది. ఈ దాడిపై టర్కీ న్యాయ మంత్రి యిల్మాజ్ టున్ మాట్లాడుతూ.. ఈ ఆత్మాహుతి దాడిపై దర్యాప్తును అంకారా చీఫ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం ప్రారంభించిందని చెప్పారు. దాడిని ఖండిస్తూ, గాయపడిన పోలీసు అధికారులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ దాడులు ఉగ్రవాదంపై టర్కీ పోరాటాన్ని ఏవిధంగానూ అడ్డుకోలేవని చెప్పారు. ఉగ్రవాదంపై మా పోరాటం మరింత ఉధృతంగా ఉంటుందని చెప్పారు.




ప్రజల కోసం... దేశం కోసం... పోరాడే ప్రతి వ్యక్తి పరిస్థితి ఇదే!




VOTE మహాత్మా క్షమించు... మహాత్మా రక్షించు...